తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 106 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 మంగళవారం 17 - 11 - 2026 వెల రూ. 2 రూ/

తెలంగాణ పల్లెలకు
ఇంటింటికే ఇంటర్నెట్

- కేంద్రం, టి-ఫైబర్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం
- తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించేందుకు 'భారత్‌నెట్' ప్రాజెక్టును వేగవంతం చేసింది
- ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.3,185 కోట్లు మంజూరు చేసింది



హైదరాబాద్ :

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించే దిశగా మరో అడుగు పడింది. సవరించిన 'భారత్‌నెట్' పథకం కింద, కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిటల్ భారత్ నిధి, టి-ఫైబర్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించడంతో ప్రతి గ్రామీణ కుటుంబానికి హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే కల సాకారానికి మరింత దగ్గరైంది. ఈ కార్యక్రమం ఇప్పటికే పెద్దపల్లి, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్?లో అందుబాటులోకి తెచ్చిన ఏఐ ల్యాబ్ సేవలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఈ కొత్త ఒప్పందంతో గతంలో టీ-ఫైబర్?కు ఎదుర్కొన్న నిధుల కొరత సమస్య పరిష్కారమైంది.గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్‌నెట్ పథకాన్ని ప్రారంభించింది. టీ ఫైబర్ ద్వారా గ్రామాల్లో డక్ట్ వైర్? ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించడమే దీని లక్ష్యం. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 1,179 గ్రామ పంచాయతీలు, 482 ప్రభుత్వ - మిగతా 2 లో

ఇటలీ నేతపై చర్యలకు తెలంగాణ బీజేపీ డిమాండ్



- భారత్ సమ్మిట్ వేదికగా విదేశీ నేత చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం
- హైదరాబాద్‌లోని ఎఫ్ఆర్ఆర్ఓకు ఫిర్యాదు చేసిన బీజేపీ బృందం
- ఇటలీ ప్రతినిధి దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారని ఆరోపణ
- వీసా నిబంధనల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సమ్మిట్ నిర్వాహకులు నిధులపై సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి

హైదరాబాద్ :

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 'భారత్ సమ్మిట్' వేదికగా విదేశీ రాజకీయ ప్రతినిధులు చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సదస్సులో భారత వ్యతిరేక, రెచ్చగొట్టే రాజకీయ వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం సోమవారం ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ అధికారులకు - మిగతా 2 లో



తెలంగాణలో పరీక్షఫీజు

గడువు పొడిగింపు

- తెలంగాణ పదో తరగతి విద్యార్థులకు ఊరట
- ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 26 వరకు అవకాశం
- జనవరి 4 వరకు ఆలస్య రుసుముతో చెల్లింపులకు ఛాన్స్
- ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు
- ఆన్‌లైన్‌లో మాత్రమే ఫీజు చెల్లించాలని స్పష్టీకరణ

హైదరాబాద్ :

తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులకు విద్యా శాఖ కీలక సమాచారం - మిగతా 2 లో

తెలంగాణకు పొంచి ఉన్న
తాగునీటి ముప్పు



- శ్రీశైలంలో తగ్గుతున్న నీటి మట్టం
- శ్రీశైలం జలాశయంలో 829 అడుగులకు పడిపోయిన నీటి మట్టం
- వరుసగా వాయిదా పడుతున్న కేఆర్ఎంబీ జీఆర్ఎంబీ సమావేశాలు
- తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మధ్య తేలని తాగునీటి కేటాయింపులు

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్
ఓ ఉగ్రవాది హతం



- జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి
- ఈ ఘటనలో ఓ ఉగ్రవాది హతమవగా మరో ఉగ్రవాదిని భద్రతా బలగాలు చుట్టుముట్టాయి

ఢిల్లీ :

జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య సోమవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఓ ఉగ్రవాది హతమవగా మరో ఉగ్రవాదిని భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఉగ్రవాది లతీఫ్ భట్‌గా పోలీసులు గుర్తించారు. కుల్గామ్‌లో గతవారం జ్రాఖీ పోస్టుపై జరిగిన దాడిలో ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. ఆ దాడికి బాధ్యులైన వారిని గుర్తించి, పట్టుకోవడానికి భద్రతా సంస్థలు భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాన్ని గుర్తించిన ఆర్మీ, జ్రాఖీ, జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రత్యేక బృందాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి.వర్గాల సమాచారం ప్రకారం, కుల్గామ్ నివాసి అయిన భట్, ఓవర్‌గ్రౌండ్ వర్కర్ల నెట్‌వర్క్ సహాయంతో - మిగతా 2 లో

అంతరిక్షంలో మాయమైన భారీ గ్రహం



- సుమారు 1,000 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న భారీ వాయు గ్రహం టీవోఐ-2535 బి
- ఏడేళ్ల పాటు పరిశీలించాక హఠాత్తుగా కనుమరుగైనట్లు గుర్తించిన నాసా టెస్ టెలిస్కోప్
- పక్కనే ఉన్న మరో అదృశ్య గ్రహ గురుత్వాకర్షణ వల్లే కక్ష్యలో అనూహ్య మార్పులు
- భూమికి కనిపించే దృష్టిపథం నుంచి కాస్త పక్కకు వాలిన టీవోఐ-2535 బి కక్ష్య
- మళ్లీ 30 నుంచి 50 ఏళ్ల తర్వాతే మనకు కనిపించే అవకాశం ఉందన్న పరిశోధకులు

బంగాళాఖాతంలో అరుదైన
'ట్రిపుల్ తుపానులు'

- ఎల్ నినో ప్రభావంతో బంగాళాఖాతంలో వరుసగా మూడు తుపానులు
- అక్టోబర్, నవంబర్ నెలల్లో ఇప్పటికే ఏపీని తాకిన అర్ణబ్, మురసు తుపానులు
- ఈ నెల 20న నెల్లూరు-తుని మధ్య తీరం దాటనున్న అక్వాన్ తుపాను
- సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడమే తీవ్ర తుపానులకు ప్రధాన కారణం
- గతంలో 1976, 1987లలో కూడా ఇదే తరహాలో మూడు తుపానుల దాడి - మిగతా 2 లో



ఏపీలో రెండో విడత పంచాయతీ
ఎన్నికల షెడ్యూల్ విడుదల



- నవంబర్ 29న పోలింగ్, అదేరోజు ఓట్ల లెక్కింపు
- ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసింది
- ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ
- రెండో దశలో 4,960 సర్పంచ్, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు
- మొత్తం మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ

అమరావతి :

ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసింది. నవంబర్ 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 21న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నవంబర్ 22న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లకు అవకాశం కల్పించిన ఎస్ఈసీ నవంబర్ 23న ఆ అప్పీళ్లను పరిష్కరిస్తుంది. నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించింది.నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. నవంబర్ 29 ఉదయం 7 గంటల నుంచి - మిగతా 2 లో

ఏపీకి 'అక్వాన్' తుపాను ముప్పు



- బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు సూచన
- ఏపీ వైపు అక్వాన్ తుపాను దూసుకొస్తుంది
- ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో అక్వాన్ తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష
- పరిస్థితిని అంచనా వేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు
- గోదావరి, కృష్ణా, గుంటూరు సహా పలు జిల్లాలపై ప్రభావం
- ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

అమరావతి :

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. ఆరు గంటలుగా 17 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకు 650 కిలోమీటర్లు, విశాఖకు 730 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 850 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. బంగాళాఖాతంలో ఇవాళ సాయంత్రానికి తుపానుగా బలపడే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది.ఈ నెల 20న మధ్యాహ్నానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. నెల్లూరు-తుని మధ్య అతి తీవ్ర తుపానుగా తీరం దాటే అవకాశం ఉంది. దీనికి అక్వాన్‌గా ఇరాన్ నామకరణం చేసింది. ఈ క్రమంలోనే జాలర్లు సముద్రంలో వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కోస్తాంధ్రలో ఈ నెల 19, 20న భారీ నుంచి అతిభారీ వర్షాలతో పాటు కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని సూచించింది. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ప్రజలు, రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.ఈ నేపథ్యంలోనే బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండంపై సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
మంగళవారం 17 - 11 - 2026

సంపాదకీయం

చిత్తశుద్ధితోనే ఉక్రెయిన్ శాంతి



వెనకుండి యుద్ధాన్ని ఎగదోయటం వేరు... దానిపై నేరుగా జరిగే చర్చల్లో పాల్గొనటం వేరు. అలా చేస్తే బాధ్యతలు మీదపడతాయి. వాటిని నెరవేర్చక తప్పనిస్థితి ఏర్పడుతుంది. అయిదేళ్లు పూర్తికావస్తున్న రష్యా--ఉక్రెయిన్ యుద్ధంపై జరిగే రెండో విడత చర్చల్లో ఆ రెండు దేశాలతోపాటు యూరోప్ కూడా పాల్గొనటానికి అంగీకారం కుదిరింది. చర్చల్లో వారి భాగస్వామ్యాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యతిరేకిస్తున్నారంటూ వచ్చిన కథనాలకు భిన్నంగా ఈసారి యూరోప్‌ను కూడా చేర్చటానికి రష్యా అంగీకరించింది. చర్చల్లో సహజంగానే యుద్ధంలో యూరోప్ పాత్ర కూడా చర్చకు వస్తుంది. ఆ దేశాలు యుద్ధం కోరుకుంటున్నాయో, శాంతిని వాంఛిస్తున్నాయో తేటతెల్లం కావటానికి అవకాశం ఏర్పడుతుంది. వాస్తవానికి యుద్ధం ప్రారంభించింది రష్యా కాదు. 2014లో ఉక్రెయిన్‌లో అంతర్యుద్ధంగా మొదలైన ఆ ఘర్షణలోకి లాంఛనంగా 2022 ఫిబ్రవరిలో ఆ దేశం ప్రవేశించింది. ప్రచ్ఛన్నయుద్ధం పరిసమాప్తమయ్యాక 90వ దశకం మొదట్లో అప్పుడే కొత్తగా ఏర్పడిన రష్యా ఫెడరేషన్‌కు నాటో కూటమి ఒక విస్పష్టమైన హామీ ఇచ్చింది. తాము తూర్పు దిశగా 'ఒక్క అంగుళం' కూడా ముందుకు రాబోమన్నదే దాని సారాంశం. కానీ అందుకు భిన్నంగా 2004లో రష్యా సరిహద్దుల్లోని బాల్టిక్ దేశాలైన ఈస్తోనియా, లాత్వియా, లిథుయేనియాలను నాటో చేర్చుకుంది. 2008లో ఉక్రెయిన్, జార్జియాలను ఆహ్వానించింది. ఈ ప్రయత్నం ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దారితీసే ప్రమాదమున్నదని రష్యాలో అప్పటి అమెరికా రాయబారి విలియమ్ బర్న్స్ ఆనాడే తన ప్రభుత్వానికి హెచ్చరిక సందేశం పంపారు.వికీలీక్స్ పత్రాల్లో ఇది బయటపడింది. నాటో విస్తరణకు ప్రయత్నిస్తే అది 'వినాశకరమైన తప్పిదం' అవుతుందని 1977లో సోవియెట్‌పై అమెరికా విధాన రూపశిల్పిగా వ్యవహరించిన జార్జి కెనన్ హెచ్చరించారు. ఇంతటి అత్యంత సున్నితమైన, ప్రమాదకరమైన అంశంలో యూరోప్ దేశాలు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. నాటో కూటమి ఇచ్చిన హామీకి సైతం ఎగనామం పెట్టి ఉక్రెయిన్‌ను ఉసి గొల్పాయి. తీరా అంతా తారుమారు కావటంతో సాయం కోసం అమెరికా వైపు చూశాయి.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన విక్టర్ యనుకోవిచ్ ప్రభుత్వాన్ని 2014లో కుట్రపూరితంగా కూలదోసి, పాశ్చాత్య అనుకూల కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలో యూరోప్ దేశాలూ, వాటివెనకున్న అమెరికాలదే బాధ్యత. స్వతంత్రదేశంగా నాటోలో చేరాలో, వద్దో నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉక్రెయిన్‌కి ఉండకూడదా అనేవాళ్లున్నారు. కానీ ఈ మాదిరే మెక్సికో లేదా కెనడా రష్యాతో చెట్టపట్టాలేసుకుంటే అమెరికా మౌనంగా ఉంటుందా?1962లో క్యూబాలో సోవియెట్ అణుక్షిపణి మోహరించినప్పుడు అమెరికా సహించగలిగిందా? దాన్ని తొలగించేదాకా ఊరుకుందా? అబూదాబి చర్చల్లో యుద్ధ ఖైదీల మార్పిడికి అంగీకారం కుదిరింది. యూరోపియన్, నాటో కూటమి దూతల్ని కలవడానికి అక్కడ రష్యా నిరాకరించటం, అటు తర్వాత యూరోప్ చర్చల్లో పాల్గొనటానికి తాము వ్యతిరేకం కాదని పుతిన్ చెప్పడం ఆ దేశాల్లో భయాందోళనలు రేకెత్తించాయి. నాటో కొత్తగా ఏ దేశాన్నయినా చేర్చుకోరాదనీ, తూర్పు ప్రాంతంలోవున్న తమ దళాలనూ, అక్కడున్న సైనిక సామగ్రిని ఉపసంహరించాలనీ రష్యా కోరే ప్రమాదం ఉన్నదని అవి అనుమానిస్తున్నాయి. నిజానికి ఈ రెండూ గొంతెమ్మ కోర్కెలేమీ కాదు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనటానికి యూరోప్ దేశాలు ఇంతవరకూ చేసిన ప్రతిపాదనంటూ ఏమీ లేదు. ఉక్రెయిన్‌లోని డోన్బాస్ ప్రాంతంలోనూ, మరోరెండుచోట్లా రష్యా సేనలు వైదొలగాలన్నదే వాటి డిమాండ్.అన్నిటికీ ఒప్పుకుని రష్యా ఉపసంహరించుకుంటే 'భవిష్యత్తులో రష్యానుంచి ముప్పురాకుండా' ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వొచ్చన్నది వాటి ఎత్తుగడ. ఇందుకు బదులు ప్రచ్ఛన్నయుద్ధ పరిసమాప్తి తర్వాత రష్యాకిచ్చిన హామీ ఏమిటో గుర్తుతెచ్చుకుని విజ్ఞత ప్రదర్శించటం యూరోప్ దేశాలకే మంచిది. రెండు రోజులపాటు దబ్లిన్‌లో జరిగిన యూరోప్ శిఖరాగ్ర సమావేశంలో తమ తరఫున రెండో దశ చర్చల్లో పాల్గొనే ప్రతినిధిని ఎంపిక చేసుకోవటంలో అవి విఫలమయ్యాయి. ఇప్పటికైనా చిత్తశుద్ధి ప్రదర్శిస్తే ఉక్రెయిన్ శాంతి సాధ్యపడుతుంది. ఆలస్యమైనకొద్దీ లబ్ధిపొందేది రష్యానే అని యూరోప్ దేశాలు గుర్తుంచుకోవాలి.

ఏపీకి 'అక్వాన్' తుపాను ముప్పు

మొదటిపేజీ తరువాయి - ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రానికి తుపానుగా బలపడే సూచనలున్నాయని అధికారులు ఆయనకు వివరించారు. ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర తీరంలో వర్ష సూచనలు ఉన్నట్లు చెప్పారు. ఈ క్రమంలో స్పందించిన చంద్రబాబు పరిస్థితిని అంచనా వేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలి : కేంద్ర బృందం సిఫారసులను పరిగణనలోకి తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని స్పష్టంచేశారు. అర్నబ్ తరహాలోనే అక్వాన్ తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందని, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు సహా వివిధ జిల్లాల్లో ప్రభావం ఉంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.మరోవైపు అక్వాన్ తుపాను దృష్ట్యా రైతులు, జాలర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తుపాను ప్రభావంతో పంటలకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23.87 లక్షల హెక్టార్ల పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. తీరప్రాంత 10 జిల్లాల్లో 9.51లక్షల హెక్టార్ల పంటల రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. 16 జిల్లాల్లోని 2.69 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలపై పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. కోతకు సిద్ధమైన పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఇప్పటికే 30,635 బోట్లు సురక్షితంగా తీరం చేరాయని వివరించారు. ఉద్యాన పంటలకు నష్టం జరిగితే వారంలో పూర్తి వివరాలు ఇవ్వాలని అచ్చెన్నాయుడు వెల్లడించారు.

తెలంగాణ పల్లెలకు ఇంటింటికీ ఇంటర్నెట్



మొదటిపేజీ తరువాయి - కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు కూడా టీ ఫైబర్ కనెక్షన్లను విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 3,185 కోట్ల నిధులను కేటాయించడానికి ఆమోదం తెలపడంతో సేవల విస్తరణకు అడ్డుగా ఉన్న ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి.ఇంటర్నెట్ కనెక్షన్ అవసరమైన రూటర్స్, కేబుళ్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేయనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలోని వినియోగదారులకు సరసమైన ధరకే హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుతాయి. ఇళ్లలో కంప్యూటర్లు, టెలివిజన్ల కోసం 4జీ, 5జీ నెట్‌వర్క్ సౌకర్యం లభిస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఫైబర్? పైపులు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల సేవలు పరిమితంగా లేదా సరిగ్గా అందడం లేదు. ఇప్పుడు తీసుకున్న ఈ కొత్త చర్యల ద్వారా సేవల్లో మెరుగైన మార్పులు రానున్నాయి.

ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి -

మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. నవంబర్ 30న అవసరమైన ప్రాంతాల్లో రీపోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు.

రెండో విడత ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నవంబర్ 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ

నవంబర్ 21 ఉదయం 8 నుంచి నామినేషన్ల పరిశీలన

నవంబర్ 22 సా.5 వరకు తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లకు అవకాశం

నవంబర్ 23న నామినేషన్ల అప్పీళ్ల పరిష్కారం

నవంబర్ 24 మ.3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం

నవంబర్ 24 మ.3 తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన

నవంబర్ 29 ఉ.7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్

నవంబర్ 29 మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

నవంబర్ 30న అవసరమైన ప్రాంతాల్లో రీపోలింగ్, అనంతరం ఫలితాల ప్రకటనట

మూడు దశల్లో పోలింగ్ : రాష్ట్రంలో 13,171 పంచాయతీలకు మూడు దశల్లో పోలింగ్ నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26, 29, డిసెంబరు 2న మూడు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈనెల 17న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 21 తుదిగడువు. ఈనెల 26న పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. రీపోలింగ్ అవసరమైతే ఈనెల 27న నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.రాష్ట్రంలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏ ఊరిలో ఎప్పుడు పోలింగ్ జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ https://swarnapanchayat.apcfss.in/knowyourgramanelectionshedule లో వివరాలు పొందుపరిచింది. మొబైల్ ఫోన్‌లో ఈ సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. జిల్లా, మండలం, పంచాయతీని ఎంపిక చేసి సెర్చ్ చేయగానే గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూలు వివరాలు వస్తాయి. ఆస్తి పన్నుతో పాటు వివిధ రుసుముల వసూళ్ల కోసం ప్రారంభించిన స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఇప్పటికే బాగా ప్రాచుర్యం పొందింది.

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ ఓ ఉగ్రవాది హతం

మొదటిపేజీ తరువాయి -

దక్షిణ కశ్మీర్‌లోని రహస్య స్థావరాల మధ్య తిరుగుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. అనంతనాగ్‌లోని లాల్ చౌక్ ప్రాంతంలో జులై 22న జరిగిన పోలీస్ కానిస్టేబుల్ హత్య, కుల్గామ్‌లో జులై 31న జరిగిన వలస కార్మికుల హత్యతో సహా 2026లో జరిగిన వరుస ఉగ్రదాడుల్లో భట్‌పై ఇప్పటికే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, కుల్గామ్ దాడి జరిగిన 24 గంటలలోపే, కిష్త్వార్ జిల్లాలో బాబీ చంద్, యశ్‌పాల్ కుమార్ అనే ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారులను ఉగ్రవాదులు హతమార్చారు. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా సైన్యంలో చేరడానికి ఆ ఇద్దరు స్నేహాలు వెళ్తుండగా ఘటన జరిగినట్లు సమాచారం.మరోవైపు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నలిన్ ప్రభాత్, కశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుజిత్ కుమార్ ఇతర సీనియర్ అధికారులతో కలిసి కుల్గాను ఆదివారం సందర్శించారు. భద్రతా పరిస్థితిని సమీక్షించి, ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా, సీఆర్‌పీఎఫ్ జమ్మూకశ్మీర్ జోన్ ప్రత్యేక డైరెక్టర్ జనరల్ సందీప్ ఖిర్వార్ మాట్లాడుతూ, ఇటీవల సీఆర్‌పీఎఫ్ సైనికులపై జరిగిన ఉగ్రదాడికి సంబంధించి భద్రతా సంస్థలు కీలక ఆధారాలు సేకరించాయని, ఇందులో ప్రమేయం ఉన్నవారిని న్యాయస్థానం ముందు నిలబెడతామని చెప్పారు. భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి సీఆర్‌పీఎఫ్ సిద్ధంగా ఉందని, సంభావ్య ముప్పులను ముందుగానే ఊహించి సమర్థవంతంగా స్పందించేందుకు ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. అలాగే, నవంబర్ 11 దాడిలో గాయపడిన సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై కూడా ఆయన మాట్లాడారు. సైనికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, శ్రీనగర్‌లోని 92 బేస్ హాస్పిటల్‌లో వారికి వైద్య చికిత్స అందిస్తున్నారని ఖిర్వార్ తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరిని తదుపరి చికిత్స కోసం దిల్లీకి తరలించగా, వారి ఆరోగ్యం కూడా బాగానే ఉందని చెప్పారు.నవంబర్ 11న కుల్గామ్‌లోని మీర్ బజార్ సమీపంలో ఉన్న అఖ్రాన్ ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ చెక్‌పాయింట్‌పై ఉగ్రదాడి జరిగింది. విధుల్లో ఉన్న సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అనంతరం, సమీపంలోని పొదల గుండా పారిపోయారు దుండగులు. ఆ దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆ దాడికి సంబంధించి ఫోరెన్సిక్ ఆధారాలు సేకరించేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కూడా విచారణ చేపట్టింది. ఘటనా ప్రాంతంలో స్థానిక పోలీసు, సీఆర్‌పీఎఫ్ దళాలు నిఘాను పెంచాయి. ప్రభావిత ప్రాంతాల్లో గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఉగ్రదాడి అనంతరం ఘటనా స్థలంలో అదనపు బారికేడ్లు ఏర్పాటు చేసి, సాయుధ వాహనాలతో భారీగా బలగాలను మోహరించారు. క్విక్ రియాక్షన్ టీమ్‌తో కలిసి క్యాంప్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టాయి.

తెలంగాణకు పొంచి ఉన్న తాగునీటి ముప్పు

మొదటిపేజీ తరువాయి - శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, కృష్ణా-గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) సమావేశాలు నిరంతరం వాయిదా పడుతుండడం నేపథ్యంలో.. తెలంగాణలో తాగునీటి సంక్షోభం పొంచి ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో నీటి పంపకాల సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రానున్న వేసవిలో హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాలకు నీటి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు.ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 829.10 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, కనీస నీటిమట్టం (834 అడుగులు) కంటే దిగువకు పడిపోయింది. మొత్తం 215.80 టీఎంసీల సామర్థ్యానికి గాను కేవలం 48.57 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. జూరాల, సుంకేసుల, హంద్రీ నదుల నుంచి ఇన్‌ఫ్లోలు పూర్తిగా నిలిచిపోయాయి. నవంబర్ మొదటి తొమ్మిది రోజుల్లోనే 3.03 టీఎంసీల మేర నిల్వలు తగ్గాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వార్షిక ప్రవాహాలు 218 టీఎంసీలకు మాత్రమే పరిమితమయ్యాయి. రానున్న రోజుల్లో ఆవిరి కావడం, వేసవి డిమాండ్ పెరగడం వల్ల రిజర్వాయర్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది.మరోవైపు, మే నెల నుంచి జరగాల్సిన 21వ కేఆర్ఎంబీ సర్వసభ్య సమావేశం వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. చివరిసారిగా 2025 జనవరి 21న ఈ సమావేశం జరిగింది. అటు అజెండాపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో 18వ జీఆర్ఎంబీ సమావేశం కూడా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కేటాయింపులపై కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది. జనాభా ప్రాతిపదికన లేదా 50:50 నిష్పత్తిలో నీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ కోరుతోంది. కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు 5 టీఎంసీలతో పాటు, జూలై వరకు హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం అవసరాలకు మొత్తం 46 టీఎంసీల తాగునీటిని కేటాయించాలని తెలంగాణ పట్టుబడుతోంది.

తెలంగాణలో పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి - అందించింది. పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ, సవరించిన నూతన షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఫీజు చెల్లింపు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది.సవరించిన షెడ్యూల్ ప్రకారం.. ఎలాంటి ఆలస్య రుసుము (లేట్ ఫీజు) లేకుండా నవంబర్ 26 వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 8 వరకు అవకాశం కల్పించారు. రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 10 నుంచి డిసెంబర్ 21 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 23 నుంచి జనవరి 4 వరకు ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.రెగ్యులర్ విద్యార్థులు మూడు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు రాసేందుకు రూ.125 ఫీజుగా నిర్ణయించారు. మూడు సబ్జెక్టుల వరకు మాత్రమే రాసేవారు రూ.110 చెల్లించాల్సి ఉంటుంది. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు రెగ్యులర్ ఫీజుకు అదనంగా మరో రూ.60 చెల్లించాలి. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు పరీక్ష ఫీజు నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చారు.పరీక్ష ఫీజు చెల్లింపు విధానంపై విద్యాశాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఫీజు మొత్తాన్ని అధికారిక వెబ్‌సైట్ ఎంవీ.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీఙ.అఅ ద్వారా కేవలం ఆన్‌లైన్ పద్ధతిలోనే పాఠశాల లాగిన్ ఉపయోగించి చెల్లించాల్సి ఉంటుంది. మాన్యువల్ ఐఎఫ్ఎంఎస్ చలాన్లు లేదా బ్యాంకుల ద్వారా నేరుగా తీసే ఫిజికల్ చలాన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమని స్పష్టం చేసింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను పరిశీలించి, నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

ఇటలీ నేతపై చర్యలకు తెలంగాణ బీజేపీ డిమాండ్

మొదటిపేజీ తరువాయి - ఇటలీ నేతపై చర్యలకు తెలంగాణ బీజేపీ డిమాండ్అధికారికంగా ఫిర్యాదు చేసింది.నవంబర్ 12 నుంచి నవంబర్ 14 వరకు నగరంలో నిర్వహించిన ఈ సదస్సులో విదేశీ ప్రతినిధులు చేసిన ప్రసంగాలు దేశ సమగ్రతకు భంగం కలిగించేలా ఉన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు. ఎఫ్ఆర్ఆర్‌వో అధికారిని కలిసిన అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఇటలీకి చెందిన యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ నాయకుడు జియాకోమో ఫిలిబెక్ ఈ సదస్సుకు హాజరై భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారంలో భాగంగా వాడుతున్న 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనే నినాదాన్ని ఆయన ఉద్దేశపూర్వకంగా ప్రస్తావించారని, ఇది స్పష్టంగా భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడమేనని మండిపడ్డారు.వీసా నిబంధనల ప్రకారం ఏ విదేశీయుడైనా తాను సందర్శించే దేశానికి వ్యతిరేకంగా మాట్లాడకూడదని రామచందర్ రావు గుర్తుచేశారు. అయితే అందుకు విరుద్ధంగా సదరు నేత భారత ప్రభుత్వం, ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచేలా వ్యవహరించారని ఆరోపించారు. ఇటలీ ప్రతినిధి ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో వేదికపై ఉన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చప్పట్లు కొట్టడం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవ్వడం దేశాన్ని అవమానించడమేనని, కానీ వారికి ఆ విషయం అర్థం కాలేదని ఆయన విమర్శించారు. దేశాన్ని కించపరిచేలా వ్యవహరించిన ఈ చర్యకు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం దేశానికి, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే విదేశీయులకు 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని, దీని ప్రకారం ఫిలిబెక్ పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలు చేసిన అనంతరం సదరు వ్యక్తి దేశం విడిచి వెళ్లిపోయారని, అతడిని వెంటనే వెనక్కి రప్పించి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కేవలం ఆయనపైనే కాకుండా, ఇలాంటి వ్యక్తులను ఆహ్వానించి భారత గడ్డపై దేశానికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు అవకాశం కల్పించిన సదస్సు నిర్వాహకులపై కూడా దేశద్రోహానికి సహకరించిన వారిగా కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.అలాగే భారత్ సమ్మిట్ నిర్వాహకులు, ఈ సదస్సుకు హాజరైన వారి పూర్వాపరాలపై లోతైన దర్యాప్తు జరపాలని రామచందర్ రావు కోరారు. జార్జ్ సోరోస్ వంటి శక్తుల నుంచి నిధులు పొంది, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి, దేశంలో అరాచకం సృష్టించేందుకే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

బంగాళాఖాతంలో అరుదైన 'ట్రిపుల్ తుపానులు'

మొదటిపేజీ తరువాయి - బంగాళాఖాతంలో అరుదైన వాతావరణ పరిణామం చోటుచేసుకుంటోంది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావంతో బంగాళాఖాతంలో స్వల్ప వ్యవధిలోనే వరుసగా మూడు తుపానులు ఏర్పడడం తెలిసిందే. ఆగస్టు నుంచి క్రమంగా బలపడుతున్న ఎల్ నినో, డిసెంబర్ నాటికి రికార్డు స్థాయికి చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మరియు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతూ, ఈశాన్య రుతుపవనాలు మరింత చురుగ్గా మారాయి. ఫలితంగా అల్పపీడనాలు వేగంగా బలపడి తీవ్ర తుపానులుగా మారుతున్నాయి.ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ తీరాన్ని రెండు తుపానులు తాకాయి. అక్టోబర్ 28న 'అర్ణబ్' తీవ్ర తుపాను గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో (గరిష్ఠంగా 150 కి.మీ) నరసాపురం వద్ద తీరం దాటింది. ఆ తర్వాత కొద్ది రోజులకే, నవంబర్ 3న 'మురసు' తీవ్ర తుపాను గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఒంగోలు సమీపంలో తీరాన్ని తాకింది.ప్రస్తుతం ఆగ్నేయ, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం మరింత బలపడుతోంది. ఇది నేటి (నవంబర్ 16) సాయంత్రానికి తుపానుగా, మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుపానుగా మారనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ తర్వాత ఇది మరింత తీవ్రరూపం దాల్చి, నవంబర్ 20 (శుక్రవారం) ఉదయం 11:30 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు - తుని మధ్య అతి తీవ్ర తుపానుగా తీరం దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ తుపానుకు ఇరాన్ సూచించిన 'అక్వాన్' అనే పేరును ఖరారు చేశారు.ఈ విపరీత మార్పులపై ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర విశ్లేషిస్తూ.. తుపానుల సంఖ్య కంటే కూడా అవి వేగంగా తీవ్ర రూపం దాల్చే వేగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఎల్ నినో సంవత్సరాల్లో రుతుపవనాల అనంతర కాలంలో అల్పపీడనాలు బంగాళాఖాతంలోని తక్కువ అక్షాంశాల వద్ద ఏర్పడుతుంటాయని, దీనివల్ల అవి నేరుగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తీరాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆయన వివరించారు. సాధారణంగా ఎల్ నినో ఉన్నప్పుడు ఈశాన్య రుతుపవనాలు బలంగా మారి తమిళనాడు, కేరళ, దక్షిణ ఆంధ్రప్రదేశ్, దక్షిణ కర్ణాటక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక వర్షాలు కురుస్తాయని మాజీ డీజీ కేజే రమేశ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇలా స్వల్ప వ్యవధిలో మూడు తుపానులు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో 1976 నవంబర్‌లో, ఆ తర్వాత 1987 అక్టోబర్ మధ్య నుంచి నవంబర్ మధ్య కాలంలో కూడా వరుసగా మూడు తుపానులు రాష్ట్రాన్ని తాకాయి. ఆ రెండు

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
మంగళవారం 17 - 11 - 2026

కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ అయిన కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఎన్. సుందరేశ్వర్ రావు అధ్యక్షతన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను అత్యంత ఘనంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఎన్. సుందరేశ్వర్ రావు మాట్లాడుతూ, గ్రంథాలయాలు



విజ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాలను మరియు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. గ్రంథాలయాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారిలో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడానికి మరియు సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ?అనంతరం కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ కె. మహేంద్ర రావు మాట్లాడుతూ, గ్రంథాలయాలు కేవలం పుస్తకాలకు నిలయాలు మాత్రమే కాకుండా విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి దోహదపడే విజ్ఞాన కేంద్రాలని వివరించారు. ఆధునిక కాలంలో ఈ-పుస్తకాలు, ఈ-జర్నల్స్, డిజిటల్ వనరులు మరియు ఆన్‌లైన్ సమాచార సేవల ద్వారా విద్యార్థులకు విస్తృతమైన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావచ్చని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆదినారాయణ, డాక్టర్ శివశంకర్, డాక్టర్ పర్వీన్ మరియు పావని తదితరులు పాల్గొని, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థుల కోసం వివిధ పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో

ఎన్.ఎం.ఎం.ఎస్ ఉచిత పుస్తకాల పంపిణీ



రామగిరి (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో ఎన్.ఎం.ఎం.ఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్షకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని జన విజ్ఞాన వేదిక (జెవివి) మరియు ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) సంయుక్తంగా ఒక ప్రత్యేక పుస్తక రూపంలో రూపొందించాయి. సోమవారం నాడు రామగిరి మండలంలోని కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి, రామగిరి మండల అధ్యక్షులు బాలగొండ శివయ్య, మండల నాయకులు ఆర్. గోపాల్ రెడ్డి, గడ్డం రామ్మోహన్, ఎం.వి. వెంకట శివారెడ్డి, ఎస్. శివారెడ్డి తదితరులు విద్యార్థులకు ఈ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ. 12,000 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్ అందజేస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ పుస్తకాలను జెవివి, యూటీఎఫ్‌లు సంయుక్తంగా రూపొందించి మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్ష రాయబోయే విద్యార్థులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులతో పాటు కుంటిమద్ది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖచ్చితత్వం, పారదర్శకతతో

జనగణన నిర్వహించాలి డీఆర్వో మాలోల



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : జనగణన--2027 రెండో దశ జనాభా గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు గాను అనంతపురం జిల్లాలోని ఫీల్డ్ ట్రైనర్లకు (2 మరియు 3 బ్యాచ్‌లు) సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్‌టియు) సివిల్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మాలోల ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ట్రైనర్లను ఉద్దేశించి డీఆర్వో మాలోల ప్రసంగిస్తూ, రెండో దశ జనాభా గణన విజయవంతం కావడంలో ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర, బాధ్యతలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాల్సిన విధానాలపై ఆయన పలు సూచనలు చేశారు. జనాభా గణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వం, పారదర్శకత మరియు అధికారుల మధ్య సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి గణన విధివిధానాలపై సమగ్ర అవగాహన కల్పించి, జనగణన కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ డిబాకర్ బరిహా, సెన్సెస్ స్టాటిస్టికల్ ఆఫీసర్ దీపక్ భరద్వాజ్, సూర్యవర్ధన్ రెడ్డి, కలెక్టరేట్ సెన్సెస్ డీటీ మధుసూదన్ రావు, మాస్టర్ ట్రైనర్లు కిరణ్, జి.ఎల్.ఎన్. ప్రసాద్‌తో పాటు ఆయా బ్యాచ్‌ల ఫీల్డ్ ట్రైనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యక్ష గ్రీవెన్స్ రద్దు ఇంటి నుంచే

ఆన్‌లైన్‌లో అర్జీలు పెట్టుకునే వెసులుబాటు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : అనంతపురం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆన్‌లైన్ సేవలను, 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల నిబంధనల కారణంగా ప్రత్యక్ష ప్రజా సమస్యల వేదిక తాత్కాలికంగా నిలిచిపోయినప్పటికీ, ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి **Meekosam.ap.gov.in** వెబ్‌సైట్‌ను ఆశ్రయించవచ్చు. అలాగే, ఇప్పటివరకు దాఖలు చేసిన అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా వాటి స్థితిగతులను తెలుసుకోవాలన్నా టోల్ ఫ్రీ నంబర్ 1100 కు కాల్ చేసి సమాచారం పొందవచ్చని సూచించారు. ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నవారు 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా కూడా సులభంగా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరోవైపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ పేర్కొన్నారు. పౌరుల సంతృప్తిని మెరుగుపరిచే దిశగా నిరంతరం అభిప్రాయ సేకరణ జరుపుతున్నట్లు తెలిపారు. పౌరులు పీజీఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ స్పందనను తెలియజేయవచ్చని సూచించారు. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చే అభిప్రాయాలు నేరుగా అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతాయని వెల్లడించారు. ఫిర్యాదుల పరిష్కారంపై అభిప్రాయాలు తెలపడం పూర్తిగా పౌరుల స్వచ్ఛంద నిర్ణయమని, జిల్లా ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకుని మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పెద్దవడుగూరులో విద్యార్థులకు బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు

పెద్దవడుగూరు తెలుగుకలం నవంబర్ 16 : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారత విభాగం ఆదేశాల మేరకు, జిల్లా బాలల పరిరక్షణ సమితి యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దవడుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టం, బాలలపై లైంగిక దాడుల నివారణ, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలు మరియు ఆత్మరక్షణ తదితర కీలక అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు తులసి అధ్యక్షత వహించి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల సమాజంలో మరియు బాల్యాలపై పడే తీవ్ర దుష్ప్రభావాలను, బాల్య వివాహాల నిషేధ చట్టం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పిల్లలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, వాటి పరిరక్షణకు అందుబాటులో ఉన్న చట్టాల గురించి



విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణ విభాగం యూనిట్ ప్రతినిధి రమాదేవి మాట్లాడుతూ, పిల్లలపై జరిగే లైంగిక వేధింపులను గుర్తించడం, వాటి పట్ల అప్రమత్తంగా ఉండటం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్' మధ్య తేడాలను సులభంగా వివరించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా, వేధింపులకు పాల్పడినా ఎలాంటి భయానికి లోనుకాకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు ధైర్యంగా తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే బాలికలు తమ ఆత్మరక్షణ పట్ల ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని, ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. బాలల భద్రత మరియు హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎంఎస్‌కే శాంతి, అంగన్వాడీ కార్యకర్తలు సంజీవమ్మ, పుష్పవతి, అరుణ, జయశ్రీ, పెద్దక్క, వాణి, వైద్య ఆరోగ్య సిబ్బంది, పాఠశాల విద్యార్థినులు మరియు కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఈ నెల 18 నుంచి నామినేషన్లు, 29న పోలింగ్

అనంతపురం తెలుగుకలం నవంబర్ 16 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు – 2026 రెండవ విడత ఎన్నికల షెడ్యూల్‌ను జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) నాగరాజునాయుడు సోమవారం విడుదల చేశారు. అనంతపురం నగరంలోని డిపిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 9 మండలాల్లో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నరసింహారెడ్డి కూడా పాల్గొన్నారు. రెండవ విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ (ఎన్నికల నిర్వహణ) నియమావళి, 2006లోని 6వ నియమం ప్రకారం రిటర్నింగ్ అధికారులు నవంబర్ 18వ తేదీన ఫారమ్-1లో ఎన్నికల నోటీసు జారీ చేయడంతో పాటు, 5వ నియమం ప్రకారం వార్డు వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అదే రోజు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. నవంబర్ 20వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్లను దాఖలు



చేసేందుకు అవకాశం కల్పించారు. అనంతరం నవంబర్ 21వ తేదీ ఉదయం 8:00 గంటల నుండి నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల పరిశీలనలో తిరస్కరణకు గురైన అభ్యర్థులు నవంబర్ 22వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (అప్పీలేట్ అధికారి) వద్ద అప్పీలు చేసుకోవచ్చు. ఈ అప్పీళ్లను నవంబర్ 23వ తేదీన అప్పీలేట్ అధికారి పరిష్కరిస్తారు. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు నవంబర్ 24వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు గడువు విధించారు. ఆ సమయం ముగిసిన వెంటనే పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబర్ 29వ తేదీన ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన గంట తర్వాత, అంటే అదే రోజు మధ్యాహ్నం 2:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమై, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 14(10) ప్రకారం ఫలితాలు ప్రకటించిన రోజే ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఒకవేళ ఏదైనా అనివార్య కారణాల వల్ల ఆ రోజు ఉప సర్పంచ్ ఎన్నిక జరగకపోతే, మరుసటి రోజు గ్రామ పంచాయతీకి సెలవు దినం అయినప్పటికీ తప్పనిసరిగా ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఎక్కడైనా రీపోలింగ్ నిర్వహించాల్సి వస్తే, నవంబర్ 30వ తేదీ ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు పోలింగ్ జరిపి, మధ్యాహ్నం 2:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. అనంతపురం జిల్లాలో రెండవ విడతలో ఎన్నికలు జరగనున్న మొత్తం 9 మండలాల్లో గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గుత్తి, గుంతకల్, పామిడి మండలాలు ఉండగా, అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని సింగనమల, నార్పల, పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపడుతోందని డిపిఓ నాగరాజునాయుడు స్పష్టం చేశారు

పెద్దవడుగూరులో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు - మహనీయులకు నివాళి

పెద్దవడుగూరు (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : స్థానిక మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక సభా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమానికి విశేష సేవలందించిన మహనీయులను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఈశ్వరప్ప, ఉపాధ్యాయులు రామ్మోహన్, బి. నారాయణ, వై. సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతదేశ గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులైన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్. రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మెయిన్ స్కూల్ ఉపాధ్యాయుడు రామ్మోహన్ మాట్లాడుతూ,



భారతదేశ గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ ఉద్యమకారులు పోషించిన పాత్ర ఎంతో కీలకమైందని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలోనూ గ్రంథాలయాలు ప్రజల్లో చైతన్యం, విజ్ఞానం పెంపొందించడంలో విశేష పాత్ర పోషించాయని, ఈ చారిత్రక నేపథ్యాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఈశ్వరప్ప మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే గ్రంథాలయానికి వెళ్లడం, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న బాలల పుస్తకాలు, కథల పుస్తకాలను చదవడం ద్వారా జ్ఞానం, ఆలోచనా శక్తి పెంపొందుతాయని తెలిపారు. పఠన అలవాటు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడుతుందని ఆయన అన్నారు. అనంతరం ఇతర వక్తలు వై. సూర్యనారాయణరెడ్డి, బి. నారాయణ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ ఆవశ్యకతను, సమాజంలో గ్రంథాలయాల ప్రాముఖ్యతను మరియు విద్యార్థుల జీవితాల్లో పుస్తక పఠనం కలిగించే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లుతో పాటు గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

కేజీబీవి పాఠశాల, వసతి గృహాన్ని తనిఖీ చేసిన విజిలెన్స్ కమిటీ మెంబర్

గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత మరియు మౌలిక సదుపాయాలను పరిశీలించేందుకు విజిలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భాగంగా విజిలెన్స్ కమిటీ మెంబర్ వనగొంది విజయలక్ష్మి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ పాఠశాల మరియు వసతి గృహాన్ని సందర్శించి, ప్రభుత్వం నిర్దేశించిన 18 అంశాల తనిఖీ ప్రణాళిక ప్రకారం క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా వంటకు ఉపయోగించే సన్నబియ్యం, పప్పుధాన్యాలు, వంట నూనె, మసాలా దినుసుల గడువు తేదీలతో పాటు తాజా కూరగాయలు, గుడ్లు, పాల నాణ్యతను మరియు స్టోర్ రూమ్ భద్రతను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం వంటశాల శుభ్రత, వెంటిలేషన్, పాత్రల పరిశు



భ్రత, ఆర్వో ప్లాగునీటి ప్లాంట్ పనితీరుతో పాటు వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత (ఆప్రాన్, హెడ్ క్యాప్ ధరించడం వంటివి) నిబంధనలను పరిశీలించారు. డైనింగ్ హాల్‌లో ప్రదర్శించిన ప్రభుత్వ మెనూ చార్ట్ ప్రకారం విద్యార్థులకు నిర్దేశిత పరిమాణంలో పోషకాహారం అందుతుందో లేదో తనిఖీ చేస్తూ, స్వయంగా ఆహారాన్ని రుచి చూసి నాణ్యతను పరీక్షించారు. అదేవిధంగా విద్యార్థుల హాజరుకు, ఖర్చు చేసిన సరుకుల స్టాక్ రిజిస్టర్లకు మధ్య ఉన్న పొంతనను మరియు వంటగదిలో గ్యాస్, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం వసతి గృహ సిబ్బంది ప్రమేయం లేకుండా విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి, భోజన రుచి, నాణ్యత మరియు ఇతర వసతులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలకు సంబంధించిన సమగ్ర నివేదికను తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం మరియు సంక్షేమం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ కమిటీ మెంబర్ వనగొంది విజయలక్ష్మి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

అనంతపురం నగరపాలక సంస్థలో 'చిత్రగుప్త' యాప్‌పై శిక్షణ

అనంతపురం(తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : అనంతపురం నగరపాలక సంస్థ (ఏఎంసీ) పరిధిలో పాలనాపరమైన పనులను మరింత వేగవంతం చేయడానికి మరియు సంస్థ ఆదాయాన్ని పెంపొందించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత 'చిత్రగుప్త' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ యాప్ వినియోగంపై నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో సోమవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయుష్ కుమార్ మరియు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత రావు పాల్గొన్నారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులతో పాటు అడ్మిన్, ప్లానింగ్, ఎమినిటీస్ మరియు శానిటేషన్ వార్డు కార్యదర్శులకు ఈ యాప్ పనితీరుపై సాంకేతిక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన చిత్రగుప్త యాప్ కంపెనీ ప్రతినిధులు యాప్ పనితీరును వివరించారు. ఈ యాప్ పూర్తిగా ఏఐ సాంకేతికతతో పనిచేస్తుందని, దీని ద్వారా నగరంలో ఇంటి పన్ను పరిధిలోకి రాని భవనాలను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. అంతేకాకుండా, పాడైపోయిన వీధి దీపాలు మరియు మరమ్మతులకు గురైన రోడ్లను క్షేత్రస్థాయిలోనే



గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడానికి, తద్వారా నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఈ యాప్ ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద నగరంలోని ఆదిమూర్తి నగర్, కమలా నగర్, రామచంద్ర నగర్, సాయి నగర్, జీరో క్రాస్, టవర్ క్లాక్ మరియు ఉమా నగర్ ప్రాంతాల్లో ఈ యాప్ వినియోగాన్ని ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో నమోదు చేసిన వివరాలను ఇప్పటికే సంబంధిత రెవెన్యూ, ప్లానింగ్, ఇంజనీరింగ్ మరియు పబ్లిక్ హెల్త్ అధికారుల లాగిన్‌లకు అనుసంధానం చేయడం జరిగింది. ఈ వివరాలను అధికారులు వారం రోజుల్లోగా క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి, నవంబర్ 22వ తేదీ లోపల యాప్‌లో పూర్తి సమాచారాన్ని నమోదు చేయాలని



జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. శిక్షణకు హాజరైన సిబ్బంది యాప్‌పై పూర్తి అవగాహన పెంచుకుని, కలెక్టర్ నిర్దేశించిన గడువులోగా క్షేత్రస్థాయి పర్యటనలను పూర్తి చేయాలని కమిషనర్ జస్వంత రావు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మరియు ఎస్ఈ (ఎఫ్ఏసీ) షాకీర్ హుస్సేన్, టి.పి.ఓ ఓంకార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, దాక్షాయణి, రెవెన్యూ అధికారులు లక్ష్మీదేవి, సుజాత, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు మరియు పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ అన్నదానానికి 2,500 కేజీల బియ్యం విరాళం

బుక్కరాయసముద్రం (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : బుక్కరాయసముద్రం మండలం చెరువు కట్టపై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమం కోసం శింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి గారు 2,500 కేజీల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు నిరంతరాయంగా అన్నదానం నిర్వహించేందుకు తమవంతు సహాయంగా ఈ బియ్యాన్ని అందించడం ద్వారా వారు మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఇంతటి భారీ విరాళాన్ని అందించడం పట్ల ఆలయ నిర్వాహకులు ప్రత్యేక హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తూ సేవాభావాన్ని చాటుకుంటున్న జొన్నలగడ్డ పద్మావతి గారిని, ఆలూరు

సాంబశివారెడ్డి గారిని స్థానిక నాయకులు, భక్తులు మరియు పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

మంగళవారం 17 - 11 - 2026

ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు





అనంతపురం తెలుగుకలం నవంబర్ 16 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పార్టీ కార్యకర్తలు మరియు సామాన్య ప్రజల కష్టసుఖాల్లో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు స్పష్టం చేశారు. సోమవారం అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన వివిధ నియోజకవర్గాల నుండి విచ్చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు సామాన్య ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ?పలు సమస్యలు, వ్యక్తిగత మరియు ప్రాంతీయ అవసరాల నిమిత్తం జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన ప్రజలు, నాయకుల నుండి ఆయన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా అడిగి తెలుసుకున్న పూల నాగరాజు, వాటి పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రెవెన్యూ, పింఛన్లు, రహదారులు, తాగునీటి సమస్యలు, ఆర్టీసీ సేవల విస్తరణతో పాటు పలు సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన అంశాలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ?సమస్యలపై తక్షణమే స్పందించిన ఆయన, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం లభిస్తుందని, నాయకుల మధ్య సమన్వయంతో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ?కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతమయ్యాయని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందని పూల నాగరాజు పేర్కొన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి టీడీపీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బంగారం కోసం వృద్ధురాలి హత్య



రొద్దం (తెలుగు కలం) (నవంబర్ 16) : శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలంలో ఓ వృద్ధురాలి దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మండలంలోని డీఆర్ కొట్టాలకు చెందిన భారతమ్మ (65) అనే వృద్ధురాలు మూడు రోజుల క్రితం రేషన్ బియ్యం తీసుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యారు. ఎంతసేపటికీ ఆమె తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ?ఈ క్రమంలో సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని పొలాల్లో పూర్తిగా కాలిపోయిన స్థితిలో ఓ మృతదేహం కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని అదృశ్యమైన భారతమ్మదిగా గుర్తించారు. ?వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకునేందుకే దుండగులు ఆమెను హత్య చేసి, ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై హత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం అన్ని కోణాల్లో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

బండ్లపల్లిలో బలపడిన టీడీపీ..

కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే



నార్పల (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : నార్పల మండలంలోని బండ్లపల్లి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి (వైసీపీ) గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధికార తెలుగుదేశం పార్టీలో (టీడీపీ) చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని, పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తాము టీడీపీలో చేరుతున్నట్లు వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి, నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ చేరికల కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కుళ్లాయప్ప, సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసనాయుడు, ఉమామహేశ్వర నాయుడు తదితరులు పాల్గొని నూతనంగా చేరిన వారికి అభినందనలు తెలిపారు.

భూ రికార్డుల లోపాలను

సవరించి రీసర్వే వేగవంతం చేయాలి జేసీ ఆదేశం



అనంతపురం తెలుగుకలం నవంబర్ 16 : భూ రీసర్వే పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జిల్లాలో రీసర్వే పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయష్ కుమార్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏడీ సర్వే, ఎస్‌డీసీ, కేఆర్‌ఆర్‌సీ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీసర్వే పురోగతి, భూ రికార్డుల్లో ఉన్న లోపాలు మరియు పరిష్కరించాల్సిన పెండింగ్ సమస్యలపై జాయింట్ కలెక్టర్ విస్తృతంగా సమీక్షించారు. రీసర్వేకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తూ, రీసర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో కీలక నిర్ణయం

శింగనమల సర్పంచ్ బరిలో కురాకు రాముడు



శింగనమల (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : శింగనమల గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎంపిక విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ క్యాంపు కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు మద్దతుదారులు విస్తృతంగా చర్చించి, సర్పంచ్ అభ్యర్థిగా కురాకు రాముడు పేరును ఏకగ్రీవంగా ఖరారు చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాలు, సూచనల మేరకు ఈ ఎంపిక జరిగినట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, ముఖ్యంగా గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రానున్న ఎన్నికల ప్రక్రియలో పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేసి కురాకు రాముడు విజయానికి కృషి చేస్తామని, తద్వారా శింగనమల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఈ సమావేశంలో నాయకులు, మద్దతుదారులు స్పష్టం చేశారు.

ఆర్చరీ పోటీల్లో సత్తా చాటిన కాటవరం విద్యార్థులు



సీతానగరం(తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో సీతానగరం మండలం కాటవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. ఈ పోటీల్లో ఇండియన్ రౌండ్ విభాగంలో బి. విక్కీ, అండర్-17 బాలికల విభాగంలో యు. సుచిత్ర, టి. లక్ష్మి విజయం సాధించారు. అలాగే రికర్వ్ విభాగంలో సిహెచ్. ప్రసన్న, ఎన్. చంటిబాబు విజేతలుగా నిలిచారు. కాంపౌండ్ అండర్-14 బాలికల విభాగంలో ఎ. పల్లవి ప్రతిభ కనబరిచి విజయం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పి. లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థుల కష్టాన్ని, ప్రతిభను కొనియాడారు. విద్యార్థుల విజయానికి కీలక పాత్ర పోషించిన పీడీ ఎం. కుమారిని, ఉపాధ్యాయులను హెచ్ఎంతో పాటు విద్యార్థులు మరియు గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.

తిరునాంపల్లిలో అగ్నిప్రమాదం..

రూ.2 లక్షల విలువైన పశుగ్రాసం దగ్ధం





యాడికి నవంబర్ 16 తెలుగుకలం : యాడికి మండల పరిధిలోని తిరునాంపల్లి గ్రామంలో సోమవారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో ఓ రైతుకు చెందిన పశుగ్రాసం పూర్తిగా కాలిబూడిదైంది. గ్రామానికి చెందిన రైతు కాకర్ల రాజారెడ్డి తన పశువుల అవసరాల కోసం సొంత కళ్లం దొడ్డిలో పెద్ద మొత్తంలో పశుగ్రాసాన్ని నిల్వ ఉంచారు. అయితే ప్రమాదవశాత్తు నిల్వ ఉన్న గడ్డివాముకు మంటలు అంటుకోవడంతో క్షణాల్లోనే అవి చుట్టుపక్కలకు వేగంగా వ్యాపించాయి. ?దట్టమైన పొగలు, ఎగిసిపడుతున్న మంటలను గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే కళ్లంలోని పశుగ్రాసం పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు కాకర్ల రాజారెడ్డి కన్నీరుమున్నీరుగా విలపించారు. ?కష్టపడి సమకూర్చుకున్న పశుగ్రాసం కళ్లముందే బూడిద కావడంతో పశువుల పోషణ భారంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన తనను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు రాజారెడ్డి విజ్ఞప్తి చేశారు.

రైతు సంక్షేమంలో 'అగ్రిస్టాక్' కీలకం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం తెలుగుకలం నవంబర్ 16 : వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో 'అగ్రిస్టాక్' సమాచారాన్ని రైతులకు ప్రయోజనకరంగా ఏ విధంగా వినియోగించవచ్చనే అంశంపై సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జూమ్ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, జిల్లా వ్యవసాయ అధికారి జిల్లా సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, రెవెన్యూ, నీటిపారుదల, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, మార్కెటింగ్, ప్లానింగ్, బ్యాంకింగ్, గిరిజన సంక్షేమం మరియు ఇతర అనుబంధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ, అగ్రిస్టాక్ ప్లాట్‌ఫారమ్ ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు సులభంగా అందడంతో పాటు వేగంగా పంట రుణాలు, పంటల బీమా, నష్టపరిహారం, వ్యవసాయ సలహాలు మరియు మద్దతు ధర కొనుగోళ్లు వంటి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. వివిధ శాఖల పథకాలలో ఈ అగ్రిస్టాక్ ప్లాట్‌ఫారమ్‌ను ఏ విధంగా వినియోగించుకోవచ్చో స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని 5 రోజులలోగా సిద్ధం చేసి సమర్పించాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. సాలు రెడ్డి మాట్లాడుతూ, భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఒక రైతు కేంద్రీకృత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (DPI) వ్యవస్థే అగ్రిస్టాక్ అని వివరించారు. దేశంలోని రైతుల వివరాలు, వారి భూమి రికార్డులు మరియు సాగు పంటల సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ వేదిక ప్రధానంగా రైతు రిజిస్ట్రీ, వ్యవసాయ భూమి రిజిస్ట్రీ, జియో రిఫరెన్స్ పటాలు మరియు సాగు పంటల రిజిస్ట్రీ ఆధారంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, రెవెన్యూ, నీటిపారుదల, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, మార్కెటింగ్, ప్లానింగ్, బ్యాంకింగ్, గిరిజన సంక్షేమ శాఖలతో పాటు పలు అనుబంధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యాడికిలో వైభవంగా భైరవలింగేశ్వర స్వామి మహాకుంభా భిషేకం





యాడికి నవంబర్ 16 తెలుగుకలం : యాడికి మండల కేంద్రంలోని భైరవుని కొండపై వెలసిన శ్రీ విజయాంబిక సమేత భైరవలింగేశ్వర స్వామివారి ఆలయంలో 50వ స్వర్ణోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు వేద పండితులు జనార్దన శర్మ,బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు, పూర్ణాహుతి, శిఖర కలశాలకు పవిత్ర జలాభిషేకం నిర్వహించారు.ఈ నెల 14న కలశ స్థాపనతో ప్రారంభమైన ఉత్సవాల్లో 15న రుద్రాభిషేకం, అన్నాభిషేకం, గణపతి, నవగ్రహ, చండీ తదితర హోమాలు నిర్వహించారు. సోమవారం ప్రధాన ఘట్టమైన మహాకుంభా భిషేకం, శిఖర కలశ మహాస్నపనం, మహా మంగళహారతి నిర్వహించారు.ఈ సందర్భంగా యాడికితో పాటు పరిసర గ్రామాల నుంచి నాయకులు, ప్రజలు ,పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నార్పల సర్పంచ్ బరిలో ఎవరు మండల వ్యాప్తంగా ఉత్కంఠ



నార్పల (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : మండల కేంద్రమైన నార్పల మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎంపికపై మండల వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గత నాలుగు రోజులుగా నార్పలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో, దుకాణాలు, టీ కొట్లు, రచ్చబండల వద్ద ఎక్కడ చూసినా ఇదే విషయంపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. రేపటి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ప్రధాన పార్టీల నాయకులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరన్నది మరో రెండు రోజుల్లో తేలిపోతుందని గ్రామస్తులు భావిస్తున్నారు. నార్పల మేజర్ పంచాయతీ బీసీలకు రిజర్వ్ కావడంతో, గ్రామంలో అధిక సంఖ్యలో ఉన్న బోయ, గాండ్ల, కురవ, ముస్లిం మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన ముఖ్య నేతలను తమ వైపు నుంచి బరిలోకి దించేందుకు ఇరు పార్టీల నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు, కొందరు ఆశావహులు తాము పోటీ చేస్తామంటూ నాయకుల వద్దకు వెళ్లినప్పటికీ, గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్న నాయకులు వారి పట్ల అంతగా సుముఖత చూపడం లేదని తెలుస్తోంది. అయితే, నాయకులు కోరుతున్న వ్యక్తులు మాత్రం ఒక వర్గానికి అనుకూలంగా నిలిస్తే మరొకరికి వ్యతిరేకం అవుతామనే ఉద్దేశంతో పోటీకి వెనుకాడుతున్నారు. మరికొందరైతే నాయకుల ఒత్తిడికి తలొగ్గి అవుననలేక, కాదనలేక ఏకంగా తమ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని ఊరు విడిచి వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి మూడో విడతలో జరగాల్సిన నార్పల మండల ఎన్నికలు, మూడు రోజులు ముందుగానే రెండో విడతలోకి మారడంతో రాజకీయ వేడి మరింత రాజుకుంది. మొత్తానికి నార్పల సర్పంచ్ పీఠం కోసం తలపడే అభ్యర్థులపై నెలకొన్న ఈ ఉత్కంఠకు బుధవారం నాటికి తెరపడే అవకాశం ఉంది.

ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజానీకం పడిగాపులు..

నామినేషన్ల వేళ తీవ్ర ఇబ్బందులు



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : మండల పరిధిలోని గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఆయా గ్రామ సచివాలయాల్లో సరిపడా సిబ్బంది అందుబాటులో లేకపోవడం శాపంగా మారింది. ఒకవైపు ఎన్నికల నామినేషన్ల గడువు సమీపిస్తుండటం, మరోవైపు సచివాలయాల్లో సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే మాన్యువల్ పద్ధతిలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని కోరుతూ పలువురు స్థానికులు తహశీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అయితే, నిబంధనల ప్రకారం కేవలం ఆన్‌లైన్ విధానంలో మాత్రమే ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడం జరుగుతుందని, మాన్యువల్‌గా ఇవ్వడం సాధ్యం కాదని సంబంధిత అధికారులు తేల్చి చెప్పారు. అధికారుల సమాధానంతో ఏం చేయాలో తోచని స్థితిలో ప్రజలు నామినేషన్ల రెండో రోజు సైతం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సామాన్య ప్రజలు కూడా ఎన్నికల్లో నామినేషన్లు వేసే అవకాశాన్ని కల్పించాలని పలువురు కోరుతున్నారు.

బాలికల పాఠశాలలో డీఈఓ ఆకస్మిక తనిఖీ..

మరుగుదొడ్ల అపరిశుభ్రతపై అసహనం



నార్పల (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : మండల కేంద్రంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి (డీఈఓ) అయూబ్ హుస్సేన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థన సమయానికే పాఠశాలకు చేరుకున్న ఆయన, ప్రధానోపాధ్యాయులు నాగేష్‌తో కలిసి విద్యార్థుల హాజరు శాతాన్ని మరియు పలు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడాన్ని అభినందిస్తూనే, ఈ విద్యా సంవత్సరంలో కూడా మరింత మెరుగైన ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను కలియతిరిగిన డీఈఓ, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు తమ సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్తూ, మరుగుదొడ్లకు వెళ్లే దారిలో నడవడానికి వీలుగా బండలు ఏర్పాటు చేయాలని కోరారు. తదుపరి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించిన ఆయన, ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ ప్రకాష్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బత్తలపల్లి (తెలుగు కలం) (నవంబర్ 16) : శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల పరిధిలోని నల్లబోయనపల్లి సమీపంలో సోమవారం ఉదయం తీవ్ర విషాదకర ఘటన వెలుగుచూసింది. స్థానిక రైల్వే ట్రాక్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ విషయాన్ని బత్తలపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ప్రభాకర్ అధికారికంగా ధృవీకరించారు.?ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడి మరణించాడా, ఆత్మహత్య చేసుకున్నాడా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో అతను ఎవరు, ఏ ప్రాంతానికి చెందినవాడు అనే వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. మృతుడి పేరు, వయస్సు, చిరునామా మరియు కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే వెంటనే బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ ప్రభాకర్ కోరారు. మృతుడి ఆచూకీని త్వరగా గుర్తించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమాచారాన్ని తెలిసిన వారందరికీ చేరవేయడంతో పాటు, వాట్సాప్ మరియు ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా తోడ్పడాలని సీఐ ప్రభాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కన్న తల్లిపై కొడుకు విచక్షణారహిత దాడి



కదిరి (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుటాగుళ్లలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. రక్తసంబంధాన్ని మరచి ఓ కసాయి కొడుకు తన కన్నతల్లిపైనే విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కుటాగుళ్ల గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలిపై ఆమె కుమారుడు ఆకస్మికంగా దాడికి దిగాడు. కొడుకు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడి ఉన్న ఆ వృద్ధురాలిని గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే స్పందించారు. బాధితురాలిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలిపై దాడికి గల కారణాలపై ఆరా తీస్తున్న పోలీసులు, ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ దాడి వెనుక ఉన్న పూర్తి వివరాలు, అసలు కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
మంగళవారం 17 - 11 - 2026

గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలకు వేళాపాళా లేదా?

ఆర్థోపెడిక్ డాక్టర్ సుబ్బరాయుడు విధుల నిర్వహణపై రోగుల ఆగ్రహం!

మధ్యాహ్నం 12:30కే డాక్టర్ వెళ్లిపోతాడన్న సిబ్బంది..

1:30 గంటకు గదికి గొళ్లెం

రోగులు పడిగాపులు.. ఖాళీ గదిలో

వృథాగా వెలుగుతున్న లైట్లు, తిరుగుతున్న ఫ్యాన్లు





గుంతకల్లు నవంబర్ 16 తెలుగు కలం :- పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యులు అందుబాటులో లేకపోతే సామాన్య ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? వైద్యం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సరైన సమయంలో వైద్య సేవలు అందించాల్సిన బాధ్యతను ఎవరు నిర్వర్తించాలి? గుంతకల్లు ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ ఓపీ విభాగం వద్ద చోటుచేసుకున్న పరిస్థితులు ఈ ప్రశ్నలను తెరపైకి తెస్తున్నాయి.ఎముకలు, కీళ్ల సంబంధిత సమస్యలతో బాధపడుతూ గుంతకల్లు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ఎంతోమంది రోగులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. అలాంటి రోగులకు వైద్య సేవలు అందించాల్సిన ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ సుబ్బరాయుడు అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆరోపిస్తున్నారు.మధ్యాహ్నం 12:30 గంటల నుంచే పలువురు రోగులు డాక్టర్ కోసం ఓపీ వద్ద నిరీక్షిస్తున్నప్పటికీ వైద్యుడు కనిపించకపోవడంతో అక్కడి సిబ్బందిని ఆరా తీశారు. దీనికి సిబ్బంది ఇచ్చిన సమాధానం రోగులను విస్మయానికి గురిచేసింది. డాక్టర్ 12:30 గంటలకే వెళ్లిపోతాడు అని సిబ్బంది చెప్పినట్లు రోగులు విలేకరులకు వెల్లడించారు.ఈ సమాచారం నేపథ్యంలో విలేకరులు స్వయంగా ఆర్థోపెడిక్ ఓపీ గదిని పరిశీలించగా మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గది బయట నుంచి గొళ్లెం పెట్టి గడియ వేసి ఉండటం కనిపించింది. గదిలో వైద్యుడు లేకపోయినా ఫ్యాన్లు, లైట్లు మాత్రం ఆన్‌లోనే ఉండటం గమనార్హం. దీంతో ఆసుపత్రిలో విధుల నిర్వహణతో పాటు ప్రభుత్వ విద్యుత్ వినియోగంపై కూడా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆసుపత్రికి వచ్చేది రోగులా.. వైద్యుల కోసం ఎదురుచూసే ప్రజలా? :-

ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే వారిలో ఎక్కువమంది పేద, మధ్యతరగతి ప్రజలే. ముఖ్యంగా ఎముకల నొప్పులు, కీళ్ల సమస్యలు, ప్రమాదాల్లో గాయపడిన వారు ఎంతో ఇబ్బందిపడుతూ ఆసుపత్రికి చేరుకుంటారు. గ్రామాల నుంచి ప్రయాణ ఖర్చులు భరించి వచ్చిన వారికి వైద్యుడు అందుబాటులో లేకపోవడం వల్ల సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయి.రోగులు నిర్ణీత సమయానికి ఆసుపత్రికి వస్తున్నప్పుడు వారికి వైద్య సేవలు అందుబాటులో ఉండాల్సిన అవసరం లేదా? ఓపీకి వచ్చే రోగులకు వైద్యం అందించడం కంటే వైద్యుడు ఎప్పుడు వెళ్లిపోతాడనే విషయమే సిబ్బంది సమాధానంగా మారడం ఏమిటి? వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలను గంటల తరబడి నిరీక్షించేలా చేయడం ఎంతవరకు సమంజసం? అని రోగులు ప్రశ్నిస్తున్నారు.

గదికి గొళ్లెం.. లోపల విద్యుత్ వృథా! పట్టించుకునే నాథుడే లేడా? :-



విలేకరుల పరిశీలనలో మరో అంశం వెలుగులోకి వచ్చింది. ఆర్థోపెడిక్ ఓపీ గదిలో ఎవరూ లేకపోయినా ఫ్యాన్లు, లైట్లు ఆన్‌లోనే ఉండటం కనిపించింది. గదిని వదిలి వెళ్లేటప్పుడు విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయాలనే కనీస బాధ్యత లేదా? ప్రభుత్వ ఖజానా నుంచి విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నప్పుడు దాని వినియోగంపై బాధ్యత వహించాల్సిన అవసరం లేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఒకవైపు పేద రోగులకు వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం, మరోవైపు ఖాళీ గదిలో విద్యుత్ వృథా అవుతున్నట్లు కనిపించడం ఆసుపత్రి నిర్వహణ తీరుపై అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆసుపత్రిలో వైద్యుల విధుల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది.

వైద్యుల హాజరుపై పర్యవేక్షణ లేదా? :-

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే ప్రతి వైద్యుడికి విధుల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు ఉంటాయి. వాటి ప్రకారం రోగులకు వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో విధుల నుంచి వెళ్లాల్సి వచ్చినా రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. అలాంటప్పుడు ఆర్థోపెడిక్ ఓపీకి వచ్చిన రోగులకు వైద్యుడు అందుబాటులో లేకపోవడానికి కారణమేంటో ఆసుపత్రి యాజమాన్యం వివరించాలి.ఆ రోజు డాక్టర్ సుబ్బరాయుడు హాజరు వివరాలు, విధుల సమయాలు, ఓపీ రిజిస్టర్, రోగులకు అందించిన వైద్య సేవల వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించాలి. రోగులు చేసిన ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయా లేదా అన్నది విచారించి తగిన చర్యలు తీసుకోవాలి.

జిల్లా వైద్యాధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? :-

గుంతకల్లు ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి కేవలం పట్టణ ప్రజలకే కాకుండా పరిసర గ్రామాల ప్రజలకు కూడా ప్రధాన వైద్య కేంద్రంగా ఉంది. ఇలాంటి ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోతే పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఉచిత వైద్యం అందుతుందనే నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నిరాశ ఎదురుకాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి ఉన్నతాధికారులు ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి. ఆర్థోపెడిక్ ఓపీ సేవలు నిర్దేశిత సమయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. విధుల పట్ల నిర్లక్ష్యం జరిగినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల కోసం పనిచేయాలి కానీ ప్రజలే వైద్యుల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు. పేదవాడికి వైద్యం అందడం దయాదాక్షిణ్యం కాదు.. అది అతని హక్కు. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్య సేవలపై నెలకొన్న ఈ పరిస్థితులకు బాధ్యులెవరు? జిల్లా అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? రోగులకు సరైన వైద్యం అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది ఇప్పుడు ప్రజల ముందున్న ప్రశ్న.

కమలపాడులో సీఐ శ్రీనివాసులు పర్యటన

ఎన్నికల వేళ శాంతిభద్రతలపై గ్రామస్తులకు అవగాహన



యాడికి నవంబర్ 16 (తెలుగుకలం): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు యాడికి యూపీఎస్ సీఐ శ్రీనివాసులు సోమవారం మండలంలోని కమలపాడు గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, సమస్యా త్మక ప్రాంతాలను పరిశీలించి స్థానిక పరిస్థితులను తెలుసుకు న్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై ఎన్నికల సమయంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకోవాలని,ఎలాం టి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని సూచించా రు.ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,ఎవరైనా గొడవలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందిం చాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

స్ఫటిక లింగ మల్లికార్జున స్వామికి విశేష అభిషేకాలు



యాడికి, నవంబర్ 16 (తెలుగు కలం): యాడికి మండల కేంద్రంలోని నాగులకట్ట వీధిలో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో కోటి సోమవారాల పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీ స్ఫటిక లింగ మల్లికార్జున స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన స్ఫటిక లింగ మల్లికార్జున స్వామివారిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు.కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని సుఖసంతో షాలతో, సిరిసంపదలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి రావాలి

కొత్త నాయకత్వంతో గ్రామాల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి





యాడికి, నవంబర్ 16 (తెలుగు కలం): గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాత నాయకత్వానికి బదులుగా కొత్త నాయకత్వం రావాలని, విద్యావంతులైన యువతకు అవకాశం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం యాడికి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో యువతకు, విద్యావంతులకు పెద్దపీట వేశామని, అదే తరహాలో పంచాయతీ ఎన్నికల్లోనూ యువత ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా గ్రామాల్లోని ఆదాయ వనరులను గుర్తించి, పంచాయ తీలకు సొంత ఆదాయం సమకూర్చు కోవడం ద్వారా అభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. గ్రామాల భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, కొత్త నాయకత్వానికి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ, రవికుమార్ రెడ్డి, విశ్వనాథ్, తాండ్ర విక్రమ్, పెద్ద సంఖ్యలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై సమరశంఖం... జే.ఏ.ఏ.పి అనంతపురం జిల్లా కమిటీ ఏర్పాటు...!

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం...

జే.ఏ.ఏ.పీ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున...!





గుంతకల్లు నవంబర్ 16 తెలుగుకలం :- జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిగత భద్రతే ప్రధాన లక్ష్యంగా జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జే.ఏ.ఏ.పీ) అనంతపురం జిల్లా నూతన కార్యవర్గం కొలువుదీరింది.సోమవారం కళ్యాణదుర్గం పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కే.బి.మల్లికార్జున ఎన్నికయ్యారు .సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల్ లక్ష్మణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి,స్టేట్ లీడర్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిలో ఎదురవుతున్న సవాళ్లు, జర్నలిస్టుల భద్రత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం మరింత క్రియాశీలకంగా పనిచేయాలనే సంకల్పంతో నూతన జిల్లా కార్యవర్గాన్ని సర్వసమ్మతితో ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షుడిగా కే.బి.మల్లికార్జున,గౌరవ అధ్యక్షులుగా జి.రఘునాథ్ రెడ్డి,పూజారి తిమ్మప్ప, ఉపాధ్యక్షులుగా సి.రామాంజనేయులు,వి.వన్నూరు స్వామి, పి. వెంకటరమణ, జి. శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా డి.భాజావలి, కార్యదర్శులుగా కురుబ హరి, బి. గోవిందు, పి. హిందూ, జి. మురళీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వై. వేణుగోపాల్ రెడ్డి, డి. నరేష్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా జి.భాస్కర్ నాయుడు, హెచ్. జయరాములు, శ్రీనివాసులు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా రాజు, రాయుడు, డి. భాషా, మహాలింగ, నాగేంద్ర, ధనుంజయ, రంగస్వామి, గురు రాజా, కోదండ, నాగార్జున, రాజేష్, అస్లాం భాష తదితరులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు కే.బి. మల్లికార్జునతో పాటు కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, స్టేట్ లీడర్ ప్రసాద్ రెడ్డి తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాడాలని, జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగినప్పుడు సంఘం అండగా నిలవాలని నాయకులు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిగత భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సంఘాన్ని జిల్లాలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉంటూ ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఎన్నికతో జిల్లాలో జర్నలిస్టుల ఐక్యతకు, హక్కుల పరిరక్షణ పోరాటానికి మరింత బలం చేకూరుతుందని సమావేశంలో పాల్గొన్న నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పోలేరమ్మ దేవాలయ వార్షికోత్సవంలో మెగా ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరంలో సేవలందించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు





గుంతకల్లు, నవంబర్ 16 (తెలుగు కలం): గుంతకల్లు పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న శ్రీ పోలేరమ్మ దేవాలయం మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దొడ్డప్ప మేస్త్రి సహకారంతో నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు తోటి వైద్యులతో కలిసి పాల్గొని తన వంతుగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పత్తి హిమబిందు మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రస్తుత జీవనశైలిలో ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. అనారోగ్య సమస్యలు వచ్చిన తర్వాత వైద్యులను సంప్రదించడం కంటే, ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రతిరోజూ పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, సమయానికి నిద్రపోవడం, రోజూ కొంత సమయం వ్యాయామం చేయడం వంటి మంచి అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు. అధిక కొవ్వు, ఉప్పు, చక్కెర ఉన్న ఆహార పదార్థాలను తగ్గించి పోషక విలువలు కలిగిన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని అన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల ఆరోగ్యం విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని, స్వయంగా మందులు వాడే అలవాటును మానుకోవాలని తెలిపారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం ఎంతో ఉపయోగకరమని, సేవాభావంతో ఇటువంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దొడ్డప్ప మేస్త్రి సహకారంతో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని తెలిపారు. వైద్యం అనేది కేవలం వృత్తి మాత్రమే కాకుండా ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని, ప్రతి ఒక్కరికీ అవసరమైన సమయంలో వైద్య సహాయం అందించాలనే భావనతో ముందుకు సాగాలని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబాలు, సమాజం సంతోషంగా ఉంటాయని, ఆరోగ్యమే నిజమైన సంపద అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని డాక్టర్ పత్తి హిమబిందు ఈ సందర్భంగా సూచించారు.

ప్రవేశ పరీక్షల్లో 'జంధ్యం' తొలగించాల్సిన అవసరం లేదు.. కర్ణాటక హైకోర్టుకు కేఈఏ స్పష్టత

కర్ణాటక సీఈటీ పరీక్షల్లో జంధ్యం ధరించడంపై ఎలాంటి నిషేధం లేదన్న కేఈఏ

విద్యార్థుల యజ్ఞోపవీతం తొలగించేలా ఎలాంటి నిబంధనలూ లేవన్న స్పష్టీకరణ

పరీక్షా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని హైకోర్టుకు వివరణ

అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిష్కరించిన న్యాయస్థానం

రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశం



కర్ణాటక కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీఈటీ) పరీక్ష రాసే విద్యార్థులు జంధ్యం (యజ్ఞోపవీతం) ధరించడంపై తమ నిబంధనల్లో ఎలాంటి నిషేధం లేదని కర్ణాటక పరీక్షల ప్రాధికార సంస్థ (కేఈఏ) రాష్ట్ర హైకోర్టుకు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల నుంచి జంధ్యాన్ని బలవంతంగా తొలగించేలా ఎలాంటి మార్గదర్శకాలు లేవని కేఈఏ ఉన్నత న్యాయస్థానానికి వివరించింది. గత 2025 పరీక్షల సమయంలో కొందరు విద్యార్థుల జంధ్యాలు తొలగించిన కొన్ని సంఘటనలను నిరసిస్తూ 'అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ' హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనుశివరామన్, జస్టిస్ కేఎస్ భరత్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా కేఈఏ తరఫున అధికారులు కోర్టుకు కీలక వివరాలు సమర్పించారు. విద్యార్థులు జంధ్యం తీసివేయాలనే నిబంధనలు పరీక్షా మార్గదర్శకాల్లో ఎక్కడా లేవని తెలిపారు. గత 2025--26 సీఈటీ సమయంలో అక్కడక్కడా జరిగిన ఒకటీ రెండు ఘటనలపై ఇప్పటికే అవసరమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అన్ని జిల్లాల డిప్యూటీ కమిషనర్లకు, పరీక్షల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కేఈఏ తెలిపింది. అలాగే, ఈ ఘటనలపై కర్ణాటక రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, కర్ణాటక బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా వివరణ కోరాయని, వీటికి సంబంధించి తాము తీసుకున్న చర్యల సమగ్ర నివేదికను (స్టేటస్ రిపోర్ట్) ఇప్పటికే ఆయా కమిషన్లకు సమర్పించామని కేఈఏ కోర్టుకు వెల్లడించింది. కేఈఏ సమర్పించిన ఈ వివరాలను, ఇచ్చిన హామీలను రికార్డుల్లోకి తీసుకున్న హైకోర్టు డివిజన్ బెంచ్.. ఈ పిటిషన్‌ను పరిష్కరించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పరీక్షలను ఒకే రీతిలో, క్రమశిక్షణతో మరియు ఎటువంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. పరీక్షల నిర్వహణకు సంబంధించి డిప్యూటీ కమిషనర్లు,

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో కదిరి బ్లూమూన్ విద్యార్థుల ప్రతిభ జాతీయ పోటీలకు 8 మంది ఎంపిక



కదిరి (తెలుగు కలం) (నవంబర్ 16) : ప్రతినిధి : కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ ఆంధ్రప్రదేశ్ అండర్-25 బాయ్స్ అండ్ గర్ల్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ (2026-27) పోటీలలో కదిరి బ్లూమూన్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. కాకినాడ జిల్లా యానంలోని వైయస్సార్ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఈ నెల 13, 14, 15 తేదీలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ విభాగాలలో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలలో బ్లూమూన్ డిగ్రీ మరియు ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులు పాల్గొని కబడ్డీ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, ఫుట్‌బాల్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో గెలుపొందిన విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శ్రీ ఎం. శివశంకర్ గారు మాట్లాడుతూ, తమ విద్యాసంస్థలలో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు, అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దే విధంగా ప్రత్యేక క్రీడా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఆర్. వెంకట రెడ్డి గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి కళాశాలకు, జిల్లాకు పేరు తీసుకురావడం ఎంతో అభినందించదగ్గ విషయమని కొనియాడారు. అనంతరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఎం. మనోహర్ రెడ్డి గారు విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేసి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులు--- పవన్ కుమార్ రెడ్డి, రియాజ్, గణేష్, యశ్వంత్, వెంకటాచలపతి, మీర్ షఫీ, భానుప్రకాష్ మరియు నూర్ అష్షల్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు సి. విజయ్ కుమార్, జి. రామాంజుల రెడ్డి, డ్యానియల్, కుమార్ లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను యాజమాన్యం, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

చలికాలంలో 'ఉసిరి' ఎందుకు తినాలి



ఈ నిజాలు తెలిస్తే రోజుకొకటి తింటారట!

వింటర్‌లో ఆరోగ్యానికి మేలు చేసే ఉసిరి - జలుబు, దగ్గు నుంచి జుట్టు రాలడం వరకు అనేక సమస్యలకు చెక్ పెడుతుందంటున్న నిపుణులు!

పుల్లగా, వగరుగా ఉందని ఉసిరికాయను పక్కనబెడుతున్నారా అయితే మీరు పొరపాటు చేస్తున్నట్టే. ముఖ్యంగా చలికాలంలో ఉసిరి తప్పనిసరిగా తినాల్సిందే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఇమ్యూనిటీని మెరుగుపరచడం నుంచి చర్మానికి మేలు చేయడం వరకు ఉసిరితో చాలా లాభాలు ఉంటాయి. చలికాలంలో దీన్ని రెగ్యులర్‌గా తింటే చాలా సమస్యలు వచ్చే రిస్క్ తగ్గుతుందంటున్నారు. అసలు ఉసిరికాయ వల్ల ఆరోగ్యానికి ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి చలికాలంలో తీసుకోవడం ఎందుకు అంత ముఖ్యం ఎలా తినొచ్చు అనే విషయాలను ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.చలికాలంలో ఉసిరికాయ తినడానికి మేజర్ రీజన్ 'ఇమ్యూనిటీ'. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోతాయి. ఇన్ఫెక్షన్లు, జలుబు, దగ్గు, జ్వరం లాంటి సీజనల్ రోగాలు ఈజీగా అటాక్ చేస్తాయి. వ్యాధి కారకాలతో రోగ నిరోధక వ్యవస్థ అంత మెరుగ్గా పోరాడలేకపోవచ్చు. అయితే, ఉసిరిలో పుష్కలంగా ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్స్ శరీరానికి ఓ షీల్డ్‌లా పనిచేస్తాయి. ఇమ్యూనిటీని మెరుగ్గా ఉంచుతాయి. వైట్ బ్లడ్ సెల్స్‌ను యాక్టివేట్ చేస్తాయి. వైరస్‌లు, బ్యాక్టీరియాలపై శరీరం పోరాడే శక్తిని పెంచుతాయి. దీంతో ఉసిరి తీసుకుంటే చలికాలంలో సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు.వింటర్‌లో చాలామందిలో జీర్ణవ్యవస్థ స్లో అవుతుంది. ఎందుకంటే చలి వల్ల ఉదయం కొందరు ఫిజికల్ యాక్టివిటీలు తగ్గించేస్తారు. ఈ కాలంలో ఫుడ్ కూడా ఎక్కువగా తినే అవకాశం కూడా ఉంటుంది. వాతావరణం చల్లగా ఉండడం వల్ల నీరు కూడా సరిగా తీసుకోరు. అందుకే అజీర్తి, మలబద్ధకం, గ్యాస్ సమస్యలు వచ్చే ఛాన్స్ అధికం. ఉసిరికాయలో డైటరీ ఫైబర్ ఈ సమస్యలు తగ్గేందుకు ఉపయోగపడుతుంది. ఇది గట్ హెల్త్‌ను మెరుగుపరుస్తుంది. పేగుల కదలికలను స్మూత్ చేసి, తీసుకున్న ఆహారం సులువుగా జీర్ణమయ్యేలా చేయగలదంటున్నారు నిపుణులు. అలాగే, శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటికి పోయేందుకు హెల్ప్ చేస్తుంది. జీర్ణవ్యవస్థ సాఫీగా పనిచేసేలా చూస్తుంది.బ్లడ్ షుగర్ లెవెల్స్ కంట్రోల్‌లో ఉండేందుకు కూడా ఉసిరి తోడ్పడుతుంది. అందుకే డయాబెటిస్ ఉన్న వారు శీతాకాలంలో తప్పనిసరిగా రోజుకో ఉసిరికాయ తినడం చాలా మేలు అంటున్నారు నిపుణులు. దీంట్లో 'క్రోమియం' అనే మినరల్ ఉంటుంది. ఇది గ్లూకోజ్‌ను శరీరం సరిగ్గా ఉపయోగించుకునేలా చేస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. దీంతో రక్తంలో షుగర్ లెవెల్స్ అకస్మాత్తుగా పెరగకుండా కంట్రోల్‌లో ఉంటాయంటున్నారు. చలికాలంలో చాలామందికి ఏదో తెలియని బద్ధకంగా, ఎనర్జీ లేనట్టుగా అనిపిస్తుంది. బాడీ టెంపరేచర్ పడిపోవడమే దీనికి రీజన్. అందుకే ఈ సీజన్‌లో ఉసిరికాయ తింటే, బాడీ మెటబాలిజమ్ రేట్ మెరుగవుతుంది. శరీరానికి మంచి శక్తి దక్కుతుంది. శీతాకాలంలో ఉండే నిస్సత్తువను, అలసటను ఉసిరి తగ్గించగలదు. ఎనర్జిటిక్‌గా ఫీలయ్యేలా చేయగలదంటున్నారు.చలికాలంలో రక్తనాళాలు కుంచించుకుపోయి, గుండెపై ఎక్కువ భారం పడే అవకాశం ఉంటుంది. అందుకే ఈ కాలంలో ఉసిరి తింటే గుండె పనితీరుకు మేలు జరుగుతుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. దీంట్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు బాడీలోని ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించగలవు. ఉసిరికాయ రోజూ తింటే... ట్రైగ్లిజరైడ్స్, చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ గ్రాడ్యుయల్‌గా తగ్గే ఛాన్స్ ఉంటుంది. మంచి కొలెస్ట్రాల్ లెవల్స్ పెరుగుతాయి. ఉసిరిలోని యాంటీఆక్సిడెంట్స్ రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా చేయగలవు. బ్లడ్ ప్రెషర్‌ను కంట్రోల్‌లో ఉంచగలవు. ఇలా గుండెకు కూడా ఉసిరి మేలు చేయగలదని చెబుతున్నారు.శీతాకాలంలో గాలిలో తేమ తక్కువగా ఉంటుంది. దీంతో చర్మం పొడిబారుతుంది. నిస్తేజంగా మారుతుంది. ఈ ప్రాబ్లమ్‌కు కూడా ఉసిరి మంచి సొల్యూషన్. ఉసిరిలో విటమిన్ జ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో 'కొల్లాజెన్' ప్రొడక్షన్ పెంచుతుంది. దీంతో చర్మం తేమగా, కాంతివంతంగా ఉంటుందంటున్నారు.చలికాలంలో హెయిర్‌ఫాల్, చుండ్రు సమస్యలు కొందరిలో పెరుగుతాయి. వీటికి చెక్ పెట్టడానికి ఉసిరికాయ సహాయపడుతుంది. ఉసిరిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు స్కాల్ప్‌కు రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. దీనివల్ల జుట్టు కుదుళ్లు స్ట్రాంగ్ అవుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తి పెరగడం వల్ల కూడా స్కాల్ప్‌కు మేలు జరుగుతుంది. ఉసిరిలోని విటమిన్ జ, ఇతర ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరంలో మెరుగ్గా గ్రహించేలా చేస్తుంది. ఇది కూడా జుట్టు ఆరోగ్యానికి హెల్ప్ చేయడంతో పాటు జుట్టు రాలడాన్ని తగ్గిస్తుందంటున్నారు నిపుణులు.

'క్యాన్సర్' రాకుండా ఉండాలంటే

ఈ 'జాగ్రత్తలు' తప్పనిసరి అంటున్న నిపుణులు!

క్యాన్సర్ రిస్క్ తగ్గాలంటే ఏం చేయాలి

మీ జీవనశైలిలో ఈ మార్పులు చేసుకోవాలంటున్న ఆరోగ్య నిపుణులు!



రెగ్యులర్‌గా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చాలా రకాల క్యాన్సర్లు వచ్చే రిస్క్ తగ్గిపోతుంది. సరైన లైఫ్ స్టైల్, ఫుడ్ హ్యాబిట్స్‌ను ఫాలో అయితే క్యాన్సర్లు దూరంగా ఉండే అవకాశం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. రోజు చేసే ఆ పనులే ఆరోగ్యానికి రక్షణగా ఉంటాయంటున్నారు. మరి, క్యాన్సర్ల రిస్క్ తగ్గాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వేటికి దూరంగా ఉండాలో ఈ స్టోరీలో డీటెయిల్‌గా తెలుసుకుందాం.స్మోకింగ్ అలవాటు ఉన్నవారికి ఊపిరితిత్తులు, నోరు, గొంతు, స్టమక్, మూత్రాశయం, గర్భాశయం, మూత్రపిండాల క్యాన్సర్ సహా సుమారు 16 రకాల క్యాన్సర్లు వచ్చే రిస్క్ అధికంగా ఉంటుంది. అందుకే స్మోకింగ్ అలవాటు ఉంటే పూర్తిగా మానేయాలని చెబుతున్నారు నిపుణులు. క్యాన్సర్ రిస్క్‌ను పెంచే కారకాలు పొగాకులో ఎక్కువగా ఉంటాయి. సిగరెట్లు, బీడీలు మాత్రమే కాదు గుట్కా, కైనీ లాంటి ఇతర పొగాకు ఉత్పత్తులు వాడినా కూడా ప్రమాదమే. స్మోకింగ్ చేసే వారి పక్కన ఉండి ఆ పొగను పీల్చేవారికి లంగ్ క్యాన్సర్ రిస్క్ ఉంటుంది. అందుకే స్మోకింగ్ చేసేవారు ఆ అలవాటును స్టాప్ చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు అంటున్నారు. ఇందుకు సంబంధించిన రిపోర్టు కోసం ఈ లింక్‌పై క్లిక్ చేయండి.ఆల్కహాల్ కూడా క్యాన్సర్ల రిస్క్‌ను పెంచుతుందంటున్నారు నిపుణులు. మద్యం విపరీతంగా తాగేవారికి నోరు, గొంతు, అన్నవాహిక, లివర్, బ్రెస్ట్, పెద్ద పేగు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం అధికమని పరిశోధనలు చెబుతున్నాయి. ఆల్కహాల్ బాడీలో కరిగినప్పుడు ఎసిటాల్డిహైడ్ అనే డేంజరస్ పదార్థం తయారవుతుంది. ఇది మన బాడీలోని కణాలను పాడుచేస్తుంది. ఎంత ఎక్కువగా ఆల్కహాల్ తాగితే డేంజర్ అంత ఎక్కువగా ఉంటుంది. అందుకే క్యాన్సర్ రిస్క్ తగ్గించుకోవాలంటే ఆల్కహాల్ తాగకపోవడమే బెస్ట్ అంటున్నారు. దీనికి సంబంధించిన రిపోర్టు కోసం ఈ లింక్‌పై క్లిక్ చేయండి.అధిక శరీర బరువు కూడా అనేక రకాల క్యాన్సర్లకు కారణమవుతుంది. మీ శరీరంలో కొవ్వు ఎక్కువగా పేరుకుపోతే హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. దీనివల్ల బ్రెస్ట్, పెద్దపేగు, ఎండోమెట్రియం క్యాన్సర్లు వచ్చే రిస్క్ పెరుగుతుంది. మహిళల్లో అండాశయ, గర్భాశయ క్యాన్సర్ల ముప్పు కూడా అధికమవుతుంది. అందుకే రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజులు చేస్తూ హెల్దీ డైట్ తీసుకుంటూ వెయిట్‌ను ఎప్పుడూ కంట్రోల్‌లో ఉంచుకోవాలి.మీరు తినే ఆహారమే మీ ఆరోగ్యాన్ని చాలా వరకు నిర్ణయిస్తుంది. జంక్‌ఫుడ్, ప్రాసెస్డ్, ఆయిలీ, రిఫైన్డ్ ఫుడ్స్ ఎక్కువగా తింటే పెద్దపేగు క్యాన్సర్ రిస్క్ అధికమవుతుందంటున్నారు నిపుణులు. అందుకే వీటిని తగ్గించేయాలి. బదులుగా ఎక్కువగా కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, నట్స్, సీడ్స్ లాంటి ఫైబర్ రిచ్ హెల్దీ ఫుడ్స్ తీసుకోవాలి. ఇవి శరీరంలోని కణాలను దెబ్బతినకుండా కాపాడుతాయి. అలాగే, బెర్రీలు, క్యాబేజీ, క్యాలిఫ్లవర్ లాంటి క్రూసిఫెరస్ కూరగాయలు, వెల్లుల్లి, గ్రీన్ టీ లాంటి యాంటీ క్యాన్సర్ ఫుడ్స్ తీసుకోవాలి. ఈ ఆహారాల్లో క్యాన్సర్ కణాలను నాశనం చేయగల సమ్మేళనాలుంటాయి. ఇవి మీ క్యాన్సర్ రిస్క్‌ను డౌన్ చేస్తాయంటున్నారు నిపుణులు.క్యాన్సర్లు వచ్చే రిస్క్ తగ్గాలంటే రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం కూడా ముఖ్యమే అంటున్నారు. వ్యాయామాలు చేసేవారికి క్యాన్సర్ల రిస్క్ ఏకంగా 20 నుంచి 30 శాతం వరకు తగ్గుతుందని ఓ రీసెర్చ్ ప్రూవ్ చేసింది. వారానికి కనీసం 150 నిమిషాలు వాకింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ లాంటి యాక్టివిటీస్ కచ్చితంగా చేయాలి. వారంలో రెండు రోజులైనా వెయిట్ ట్రైనింగ్ ఇతర స్ట్రెంగ్త్ వర్కౌట్స్ చేయాలి.సూర్యరశ్మిలో ఉండే యూవీ కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. రెగ్యులర్‌గా ఎక్కువసేపు తీవ్రమైన ఎండలో ఉన్నా కొందరికి స్కిన్ క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. అందుకే, ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు వీలైనంతవరకు నీడలో ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు శరీరాన్ని ఎక్కువభాగం కప్పే దుస్తులు, టోపీ, సన్ గ్లాసెస్ ధరించాలి. బయట ఎక్కువసేపు ఉండాల్సి వస్తే ఎస్‌పీఎఫ్ 30 అంతకంటే ఎక్కువ ఉన్న బ్రాడ్ స్పెక్ట్రం సన్‌స్క్రీన్‌ను వాడాలి.కొన్ని రకాల వైరస్‌లు కూడా క్యాన్సర్ రిస్క్‌ను పెంచుతాయి. ఉదాహరణకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు, హెపటైటిస్ బి వైరస్ లివర్ క్యాన్సర్‌కు కారణమవుతాయంటున్నారు నిపుణులు. ఈ వైరస్‌ల బారినపడకుండా ముందే తగిన వ్యాక్సిన్లు వేయించుకుంటే ఆయా క్యాన్సర్ల నుంచి రక్షణ పొందొచ్చంటున్నారు.క్యాన్సర్ రిస్క్ తగ్గించుకోవడంలో హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు చాలా ముఖ్యం. కొన్ని స్క్రీనింగ్ టెస్టులతో క్యాన్సర్‌ను స్టార్టింగ్ స్టేజ్‌లోనే గుర్తించవచ్చు. మరికొన్ని టెస్టులు క్యాన్సర్‌గా మారే డేంజరస్ కణ మార్పులను ముందే పసిగట్టడానికి హెల్ప్ అవుతాయి. అయితే, అందరికీ అన్ని టెస్టులు అవసరం ఉండవు. మీ ఏజ్, ఆరోగ్య పరిస్థితి, ఫ్యామిలీ హిస్టరీలో ఎవరికైనా క్యాన్సర్ ఉందా అనే అంశాలను బట్టి ఏ టెస్ట్ ఎప్పుడు చేయించుకోవాలో డాక్టర్‌ను అడిగి తెలుసుకోవాలి. ఎలాంటి ప్రాబ్లమ్స్ లేకపోయినా మీకు స్క్రీనింగ్ టెస్ట్ సూచిస్తే వాయిదా వేసుకోవద్దంటున్నారు నిపుణులు. ఒకవేళ వయసు 40 ఏళ్లు దాటితే ఎలాంటి లక్షణాలు లేకపోయినా కొన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలి. ముందే అలర్ట్ అవ్వడానికి టెస్టులు చాలా ఉపయోగపడతాయంటున్నారు. క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందంటున్నారు నిపుణులు.క్యాన్సర్‌ను నివారించడానికి హెల్తీ లైఫ్‌స్టైల్‌తో పాటు శరీరంలో వచ్చే మార్పులపై అవగాహన ఉండాలి. బాడీలో కొత్తగా గడ్డలు ఏర్పడడం, కారణం లేకుండా విపరీతంగా బరువు తగ్గుతుండడం, మలవిసర్జన, మూత్ర విసర్జన విషయాల్లో భారీ మార్పులు, పుండ్లు తగ్గకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇవి కనిపించాయంటే క్యాన్సర్ ఉన్నట్లే అని కాదు, కానీ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకూడదని సూచిస్తున్నారు వైద్య నిపుణులు. మీ ఫ్యామిలీ క్యాన్సర్ హిస్టరీ ఉంటే మీ పర్సనల్ రిస్క్ గురించి డాక్టర్‌తో మాట్లాడాలి. క్యాన్సర్ వచ్చేందుకు కారణాలు అనేక రకాలుగా ఉంటాయి. అయితే, లైఫ్‌స్టైల్, ఫుడ్ విషయంలో పైన చెప్పిన జాగ్రత్తలు ఫాలో అయితే కొన్ని రకాల క్యాన్సర్ల రిస్క్ బాగా తగ్గుతుందంటున్నారు నిపుణులు. క్యాన్సర్ల విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత వైద్య నిపుణులను అడిగి తెలుసుకోవాలంటున్నారు.

రోజుకు చక్కెర, ఉప్పు ఎంత తీసుకోవాలి



షుగర్, సాల్ట్ ఎక్కువవాడితే ఆరోగ్యానికి మంచిది కాదనేది చాలామందికి తెలిసిందే. కానీ అసలు వీటిని ఎన్ని గ్రాములు తీసుకుంటే సేఫో మీకు తెలుసా టీ, కాఫీ, బ్రేక్‌ఫాస్ట్, భోజనం, లంచ్, స్నాక్స్, ఇతర డ్రింక్స్ ఇలా రోజులో చాలాసార్లు ఉప్పు, చక్కెర తీసుకుంటూ ఉంటాం. వీటి రుచికి అలవాటుపడి తెలియకుండానే చాలామంది లిమిట్‌కు మించి తీసుకుంటూ ఉంటారు. ఇలా చేస్తుంటే దీర్ఘకాలంలో చాలా రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. అసలు రోజులో చక్కెర ఎంత తీసుకోవాలి ఉప్పు ఎంత వాడొచ్చు వీటిని మోతాదుకు మించి అధికంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎలాంటి రిస్క్‌లు పెరుగుతాయి వీటి వాడకం తగ్గించేందుకు ఏం చేయొచ్చు అనే విషయాలను ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ 2024లో కొన్ని మార్గదర్శకాలను విడుదల చేశాయి. సాధారణంగా పెద్దలు రోజుకు 20 నుంచి 25 గ్రాముల చక్కెర మాత్రమే తీసుకోవాలని సూచించాయి. అంటే రోజులో దాదాపు 4 చిన్న టీ స్పూన్ల షుగర్ మాత్రమే తీసుకోవచ్చు. అయితే, టీ, కాఫీలు, స్వీట్లలో వేసే షుగర్ మాత్రమే కాదు, కూల్‌డ్రింక్స్, బిస్కెట్లు, ప్యాకెట్ ఆహారాల ద్వారా అందేది కూడా ఈ లెక్కలోకి వస్తుంది. బెల్లం, తేనె కూడా షుగర్స్ కిందికే వస్తాయి. వీటినీ ఈ లెక్కలో కలుపుకోవాలి. మొత్తంగా ఓ వ్యక్తి రోజుకు 25 గ్రాములలోపే షుగర్స్ తీసుకోవచ్చు. ఒకవేళ మీకు డయాబెటిస్ సహా ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే మీ పరిస్థితిని బట్టి ఈ లిమిట్ గురించి డాక్టర్ సలహా తీసుకోవాలి.చక్కెరను లిమిట్‌కు మించి ఎక్కువగా తీసుకుంటే దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ఎఫెక్ట్ ఎక్కువగానే పడుతుంది. క్యాలరీ ఇన్‌టేక్ పెరిగిపోయి, శరీర బరువు పెరిగే అవకాశం ఉంటుంది. క్రమంగా ఊబకాయం సమస్య రావొచ్చు. టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం కూడా అధికంగా ఉంటుంది. కాలేయంలో కొవ్వు పేరుకుపోయే అవకాశం ఉంటుంది. గుండె జబ్బులకు కారణమయ్యే ఇతర ఆరోగ్య సమస్యల ముప్పు కూడా పెరగొచ్చు. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు దంతాలపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా పిల్లల్లో దంతక్షయం వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే వివిధ ఆహారాలు, డ్రింక్స్ ద్వారా రోజుకు ఎంత షుగర్ తీసుకుంటున్నామో తప్పనిసరిగా లెక్కేసుకోవాలి. వీలైనంత వరకు లిమిట్ పాటించాలి. షుగర్ ఇన్‌టేక్ కంట్రోల్ చేసుకుంటే చాలా రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే రిస్క్ తగ్గుతుందని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.కొన్ని టిప్స్ పాటిస్తే చక్కెర తీసుకోవడాన్ని తగ్గించుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. టీ, కాఫీల్లో వేసుకునే షుగర్‌ను కొద్దికొద్దిగా తగ్గించండి. రోజుకు ఎక్కువసార్లు టీ, కాఫీ తాగే అలవాటు ఉంటే, ఆ సంఖ్యను కూడా తగ్గించుకోవాలి. కూల్‌డ్రింక్స్, ప్యాక్డ్ ఫ్రూట్ జ్యూస్‌లు, ఎనర్జీ డ్రింక్స్ మానేస్తే షుగర్ ఇన్‌టేక్ బాగా తగ్గిపోతుందంటున్నారు. వీటికి బదులుగా నీరు, కొబ్బరినీరు, మజ్జిగ వంటివి తాగాలి. తీపి తినాలనిపించినప్పుడు స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లకు బదులుగా పండ్లు, కూరగాయల ముక్కలు తినడం మంచిదని సూచిస్తున్నారు.ఫ్రూట్ జ్యూస్‌ల కంటే పండ్లను నేరుగా తినాలి. ఒకవేళ ఫ్రూట్ జ్యూస్ తాగాల్సి వచ్చినా, దాంట్లో షుగర్ యాడ్ చేయకూడదు. ప్యాకెట్ ఫుడ్స్ కొనేటప్పుడు వాటిపై ఉన్న న్యూట్రిషన్ లేబుల్‌ను తప్పక చదవాలి. చక్కెరతో పాటు సిరప్‌లు, ఇతర తీపి పదార్థాలు ఉన్నాయేమో గమనించాలి. బెల్లం, తేనె ఆరోగ్యకరమైనవేనని భావించి ఎక్కువగా తీసుకోకండి. అవి కూడా షుగర్సే. ఈ చిన్న మార్పులతో మీ షుగర్ ఇన్‌టేక్ బాగా తగ్గిపోతుందంటున్నారు నిపుణులు. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ 2024 మార్గదర్శకాల ప్రకారం, పెద్దలు రోజుకు 5 గ్రాములలోపు ఉప్పు తీసుకోవచ్చు. అంటే దాదాపు ఒక టీ స్పూన్. అయితే ఈ లెక్కలో వంటల్లో వేసే ఉప్పుతో పాటు పచ్చళ్లు, చిప్స్, బిస్కెట్లు, సాస్‌లు, ఇతర ప్యాక్డ్ ఆహారాల్లో ఉండేది కూడా లెక్కలోకి వస్తుంది. ఉప్పులో ఉండే సోడియం శరీరానికి అవసరమే. ఇది శరీరంలో ద్రవాల సమతుల్యతకు, నరాలు, కండరాల పనితీరుకు ఉపయోగపడుతుంది. కానీ అవసరానికి మించి సోడియం శరీరంలోకి చేరితే సమస్యలు వస్తాయి. అందుకే సాల్ట్‌ను సరైన మోతాదులో తీసుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె, రక్తనాళాల వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. దీంతో హైబ్లడ్ ప్రెషర్, గుండె వ్యాధులు, పక్షవాతం వచ్చే ప్రమాదం అధికమవుతుంది. శరీరంలో సోడియం ఎక్కువైనప్పుడు ఇన్‌ఫ్లమేషన్, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు వస్తాయి. ఉప్పు ఎక్కువగా తీసుకుంటే మూత్రపిండాలపై ఎఫెక్ట్ పడుతుంది. ఫిల్టరింగ్ వ్యవస్థ దెబ్బతినొచ్చు. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే సమస్య పెరుగుతుంది. ఉప్పు ఎక్కువగా వాడటం వల్ల యూరిన్ ద్వారా శరీరంలోని కాల్షియం ఎక్కువగా బయటకు వెళ్లిపోతుంది. దీనివల్ల దీర్ఘకాలంలో ఎముకల సాంద్రత తగ్గిపోవచ్చు. ఎముకలు తీవ్రంగా బలహీనపడేందుకు ఇది దారితీస్తుంది. ఇప్పటికే బీపీ, గుండె, కిడ్నీల సమస్యలు ఉన్నవారు ఉప్పు విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

స్వచ్ఛమైన గాలితో 'షుగర్ లెవల్స్' కంట్రోల్

అమెరికా శాస్త్రవేత్తల లేటెస్ట్ అప్‌డేట్

ఇంట్లో 'ఎయిర్ ప్యూరిఫైయర్' ఉంటే బ్లడ్ షుగర్ తగ్గుతుందా

సరికొత్త పరిశోధన వివరాలు ఏం చెబుతున్నాయంటే



రోజురోజుకీ పెరుగుతున్న వాయు కాలుష్యం కారణంగా మనం పీల్చే గాలిలో కూడా నాణ్యత పూర్తిగా కరవు అవుతుంది. ఈ క్రమంలోనే చాలా మంది స్వచ్ఛమైన గాలి కోసం ఇళ్లలో ఎయిర్ ప్యూరిఫైయర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే, ఎయిర్ ప్యూరిఫైయర్ల వల్ల కేవలం శ్వాసకోశ సమస్యలే కాకుండా, రక్తంలో షుగర్ లెవల్స్ కూడా కంట్రోల్‌లో ఉంటాయని అమెరికా శాస్త్రవేత్తల తాజా పరిశోధనలో తేలింది. ఇంతకీ, స్వచ్ఛమైన గాలికి, చక్కెర స్థాయిల నియంత్రణకు ఉన్న సంబంధం ఏంటి ఈ పరిశోధనలో వెల్లడైన మరికొన్ని ఆసక్తికరమైన విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.ఇంట్లో ముఖ్యంగా పడక గదిలో గాలిలోని ధూళి రేణువులను శుభ్రపరిచే పోర్టబుల్ ఎయిర్ ఫిల్టర్లు లేదా ఎయిర్ ప్యూరిఫైయర్లను ఉపయోగించడం వల్ల ప్రీడయాబెటిస్ ఉన్నవారి రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుందని అమెరికా శాస్త్రవేత్తలు జరిపిన ఒక పరిశోధనలో వెల్లడైంది. ఈ కొత్త అధ్యయనం 'అమెరికన్ హార్ట్ జర్నల్'లో ప్రచురితమైంది. ఈ అధ్యయనం ప్రకారం, బెడ్‌రూమ్‌లో వాయు కాలుష్యం తగ్గించడానికి పోర్టబుల్ ఫిల్టర్లను యూజ్ చేయడం వల్ల ప్రీడయాబెటిస్ బాధితుల రక్తంలో షుగర్ లెవల్స్ సడన్‌గా పెరగకుండా అదుపులో ఉంటాయని తేలింది.అమెరికాలోని న్యూయార్క్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ధమనుల్లో కొలెస్టరాల్ చేరే సమస్య(అథెరోస్క్లెరోసిస్) లేని 150 మందికి పైగా ప్రీడయాబెటిక్ పురుషులు, మహిళలపై ఈ రీసెర్చ్ నిర్వహించారు. ప్రీడయాబెటిస్ స్టేజ్ గుండె జబ్బులు, డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుందన్నది తెలిసిందే. రోజువారీగా రక్తంలో చక్కెర స్థాయిల్లో వచ్చే హెచ్చుతగ్గులు ఈ పరిస్థితిని మరింత పెంచుతాయి. ముఖ్యంగా వాయు కాలుష్యం ప్రీడయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులకు దారితీస్తుందని చెబుతున్నారు శాస్త్రజ్ఞులు.ఇంట్లో, ముఖ్యంగా బెడ్‌రూమ్‌లో స్వచ్ఛమైన గాలి వీచే ఏర్పాటు ప్రీడయాబెటిస్ ఉన్నవారు ఉదయాన్నే రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా స్థిరంగా ఉంచుకోవడానికి సహాయపడుతుందని న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ షారీన్ ఎల్. విట్‌కాప్ పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మెడిసిన్‌తో పాటు హెపా ఫిల్టర్లను ఏర్పాటు చేసుకోవడం గుండె, జీవక్రియ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సులభమైన, తక్కువ ఖర్చుతో కూడిన మార్గమని ఆమె తెలిపారు.ఈ పరిశోధనలో భాగంగా సగం మంది తమ బెడ్‌రూమ్‌లో నిజమైన ఎయిర్ ఫిల్టర్లతో, మిగిలిన సగం మంది గాలిని శుభ్రపరచని నకిలీ ఫిల్టర్లతో ఒక నెల రోజులు నిద్రించారు. నిజమైన ఫిల్టర్లు ఏర్పాటు చేసిన రూమ్‌లో హానికరమైన సూక్ష్మ రేణువుల స్థాయిలు 36 శాతం మేరకు తగ్గాయని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్నవారందరూ 'నిరంతర గ్లూకోజ్ నిఘా సాధనాన్ని' ధరించడం ద్వారా తమ రోజువారీ చక్కెర స్థాయిల్లో వచ్చే మార్పులను నమోదు చేశారని తెలిపారు.స్వచ్ఛమైన గాలి వల్ల ప్రతిరోజూ రక్తంలో సంభవించే చక్కెర స్థాయిల హెచ్చుతగ్గులు కంట్రోల్‌లో ఉండటంతోపాటు మార్నింగ్ టిఫిన్ తర్వాత నమోదయ్యే చక్కెర స్థాయి పెరుగుదల తగ్గిందని కనుగొన్నారు. గాలి నాణ్యత తగ్గడం ఊపిరితిత్తులకే కాకుండా గుండె, జీవక్రియ ఆరోగ్యానికీ ముప్పు అని న్యూయార్క్ విశ్వవిద్యాలయ నిపుణులు జోనాథన్ న్యూమాన్ తెలిపారు. వైద్యులు తమ రోగుల ఆరోగ్య నిర్వహణలో ఇంట్లోని గాలి నాణ్యతనూ పరిగణనలోకి తీసుకోవాలని అమెరికా శాస్త్రవేత్తలు జరిపిన ఈ రీసెర్చ్ సూచిస్తోంది.

చలికాలంలో 'మార్నింగ్ వాక్' సేఫేనా

నిపుణులు ఏం చెప్తున్నారంటే

వింటర్ పొల్యూషన్ అలర్ట్ - ఉదయం వేళ బయటకు వెళ్లేవారు ఈ జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు!



చలికాలం వచ్చేసింది. ఈ సీజన్‌లో తెల్లవారుజామున చల్లటి గాలిని ఆస్వాదిస్తూ నడవడం ఒక అద్భుతమైన అనుభూతి. అందుకే, ఎంతో మంది ఈ కాలంలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉదయాన్నే లేచి పార్కుల్లో వాకింగ్, రోడ్లపై జాగింగ్, సైక్లింగ్ చేస్తుంటారు. కానీ, కొద్దిరోజులుగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో పాటు మనం పీల్చే గాలిలో కాలుష్య కణాల శాతం ప్రమాదకరంగా పెరుగుతోంది. ఉదయం వేళ పీల్చే ఆ చల్లటి గాలి మీ ఊపిరితిత్తులకు అమృతం కాదు, విషపూరితమైన పొగమంచు అని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యం కోసం వెళ్లి అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవద్దని సూచిస్తున్నారు. మరి, ఈ వింట

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

తక్కువ ఈఎంఐ చూసి వెహికల్ కొంటున్నారా

ఈ ఖర్చుల గురించి తెలుసా?

ఈఎంఐతో పాటు ఇతర ఖర్చులనూ లెక్కించుకోవాలంటున్న నిపుణులు

డౌన్‌పేమెంట్, రిజిస్ట్రేషన్, బీమా, ఇంధనం, నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిందే

కనీసం మూడు నెలల ఈఎంఐలకు సరిపడా అత్యవసర నిధి ఉంటే బెటర్

రుణాల మధ్యశ్రీ= ఆధారంగా పోలిక చూసుకుంటే మేలు

వాహనం విలువ తగ్గడం, బీమా నిబంధనలు, క్రెడిట్ చరిత్రపై ప్రభావం వంటి అంశాలూ ముఖ్యమే



కొత్త కారు లేదా బైక్ కొనాలనే ఆలోచన వచ్చినప్పుడు చాలామంది ముందుగా చూసేది నెలవారీ ఈఎంఐ ఎంత ఉంటుందని. తక్కువ ఉంటే చాలు.. వాహనం కొనేయొచ్చని భావిస్తుంటారు. కానీ వాహన రుణం తీసుకోవడంలో అసలు లెక్కలు ఈఎంఐతోనే పూర్తికావు. డౌన్‌పేమెంట్, రిజిస్ట్రేషన్, బీమా, ఇంధనం, నిర్వహణ ఖర్చులు కూడా జేబుపై ప్రభావం చూపుతాయి. అంతేకాదు.. ఆదాయం తగ్గినా, అనుకోని ఖర్చులు ఎదురైనా రుణ వాయిదాలు చెల్లించగలమా? అన్నది ముందే అంచనా వేసుకోవాలి. తొలిసారి వాహన రుణం తీసుకునేవారు ఆరు కీలక విషయాలను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. వాహనం కొనుగోలు చేయడానికి డౌన్‌పేమెంట్‌తో పాటు రిజిస్ట్రేషన్, పన్నులు, బీమా కోసం డబ్బు అవసరం. రోడ్డుపైకి వచ్చిన తర్వాత ఇంధనం, సర్వీసింగ్, టైర్లు, మరమ్మతుల రూపంలో అదనపు ఖర్చులు ఉంటాయి. కాబట్టి రుణం ఎంత తీసుకోవాలనే నిర్ణయానికి ముందు వాహన నిర్వహణ సహా మొత్తం ఖర్చును లెక్కించాలి.బ్యాంకు లేదా ఆర్థిక సంస్థ రుణం మంజూరు చేసిందంటే దాన్ని సులభంగా తిరిగి చెల్లించగలమని అర్థం కాదు. వైద్య అత్యవసర పరిస్థితులు, ఉద్యోగం కోల్పోవడం, ఆదాయం తగ్గడం వంటి పరిణామాలు వాయిదాల చెల్లింపుపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా వాణిజ్య వాహనాల యజమానులకు ఈ ముప్పు ఎక్కువ. వర్షాకాలంలో ట్రిప్పులు తగ్గడం, ఇంధన ధరలు పెరగడం, సరకు రవాణా చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల ఆదాయం తగ్గొచ్చు. అందుకే కనీసం మూడు నెలల ఈఎంఐలకు సరిపడా మొత్తాన్ని అత్యవసర నిధిగా ఉంచుకోవాలి.నెలవారీ వాయిదా తగ్గుతుందని రుణ కాలపరిమితిని పెంచుకుంటే మొత్తం చెల్లించే వడ్డీ పెరుగుతుంది. ప్రాసెసింగ్ ఫీజులు, రుణంతో కలిపి ఇచ్చే బీమా కూడా ఖర్చును పెంచుతాయి. అందువల్ల తక్కువ ఈఎంఐని మాత్రమే చూసి రుణాన్ని ఎంచుకోవద్దు. అన్ని ఖర్చులతో కూడిన వార్షిక శాతం రేటు ఆధారంగా వివిధ రుణాలను పోల్చాలి. 2024 అక్టోబర్ నుంచి రిటైల్, ఎంఎస్ఎంఈ టర్మ్ లోన్లకు సంబంధించి రుణదాతలు కీ ఫ్యాక్ట్స్ స్టేట్‌మెంట్ ఇవ్వాలని ఆర్బీఐ నిబంధన విధించింది. ఇందులో ఏపీఆర్, చెల్లింపు షెడ్యూల్, ఆలస్య రుసుములు, ముందస్తు రుణ ముగింపు ఛార్జీల వివరాలు ఉంటాయి.వాహనాల రీసేల్ వాల్యూ కాలక్రమంలో తగ్గుతుంది. తక్కువ డౌన్‌పేమెంట్‌తో వాహనం కొనుగోలు చేసి, రుణం పూర్తికాకముందే అమ్మాల్సి వస్తే కొత్త చిక్కులు ఎదురుకావచ్చు. ఎందుకంటే అమ్మకం ద్వారా వచ్చే మొత్తం కంటే బకాయి రుణం ఎక్కువగా ఉండొచ్చు. వాహనం దొంగతనానికి గురైనా, పూర్తిగా దెబ్బతిన్నా బీమా పరిహారాన్ని బట్టి ఇదే పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. వీలైనంత ఎక్కువ డౌన్‌పేమెంట్ చెల్లించడం, మంచి పునఃవిక్రయ విలువ ఉన్న వాహనాన్ని ఎంచుకోవడం ఈ ముప్పును తగ్గిస్తాయి.బీమా తీసుకోవడమే కాదు.. పాలసీలో ఏయే ప్రమాదాలకు రక్షణ ఉందో, ఎలాంటి మినహాయింపులు ఉన్నాయో తెలుసుకోవాలి. వాహనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడుతున్నారా? వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారా? అన్న విషయాన్ని బీమా సంస్థకు సరిగ్గా తెలియజేయాలి. ముఖ్యంగా వాణిజ్య వాహనాల విషయంలో ఈ జాగ్రత్త అవసరం. బీమా క్లెయిమ్ తిరస్కరణకు గురైనా, మరమ్మతులకు ఎక్కువ సమయం పట్టినా ఆదాయం నిలిచిపోవచ్చు. కానీ రుణ వాయిదాలు మాత్రం కొనసాగుతాయి. సమయానికి రుణ వాయిదాలు చెల్లించడం వల్ల క్రెడిట్ చరిత్ర మెరుగ్గా ఉంటుంది. ఒక్కోసారి ఈఎంఐలు చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది. భవిష్యత్తులో రుణాలు పొందడం కష్టమవ్వొచ్చు. ఒకవేళ వాయిదా చెల్లించడం కష్టంగా మారితే రుణదాతను ముందుగానే సంప్రదించాలి. రిమైండర్లు వచ్చే వరకు వేచి చూడటం లేదా బకాయిలు పేరుకుపోయేలా చేయడం మంచిది కాదు.

సైబర్‌ట్రక్ తయారీపై వెనక్కి తగ్గిన టెస్లా.. మస్క్ కొత్త నిర్ణయం

టెస్లా సైబర్‌ట్రక్ తయారీని వచ్చే ఏడాది వేసవి చివరి వరకు కొనసాగింపు

పెండింగ్ ఆర్డర్లను పూర్తి చేసేందుకేనని వెల్లడించిన మస్క్

గతంలో ఉత్పత్తిని తగ్గించి సైబర్‌క్యాబ్ తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం

సైబర్‌ట్రక్ అమ్మకాలు అంచనాలకు తగ్గట్లు లేకపోవడంతో సబర్‌క్యాబ్‌పై దృష్టి



టెస్లా సైబర్‌ట్రక్ ఉత్పత్తికి మరికొంత సమయం దక్కింది. వచ్చే ఏడాది మధ్యలోనే ఈ పికప్ ట్రక్ తయారీని నిలిపివేయనున్నట్లు గతంలో ప్రకటించిన ఎలాన్ మస్క్.. తాజాగా ఆ గడువును వేసవి చివరి వరకు పొడిగించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్డర్లను పూర్తి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దీంతో టెక్సాస్‌లోని గిగాఫ్యాక్టరీలో సైబర్‌ట్రక్ తయారీ మరో రెండు, మూడు నెలలు కొనసాగనుంది.సైబర్‌ట్రక్ ఉత్పత్తిని తగ్గించి, ఆ సామర్థ్యాన్ని రోబోట్యాక్సీ అయిన సైబర్‌క్యాబ్ తయారీకి వినియోగించాలని టెస్లా గతంలో నిర్ణయించింది. అయితే సైబర్‌ట్రక్ కోసం ఎదురుచూస్తున్న వినియోగదారుల ఆర్డర్లు ఇంకా పెండింగ్‌లో ఉండటంతో ఉత్పత్తిని కొంతకాలం కొనసాగించాలని మస్క్ భావించారు. గతంలో నిర్ణయించిన గడువులోగా వాహనాలను తయారు చేయలేకపోతే కొందరు కొనుగోలుదారులకు డిపాజిట్లు తిరిగి ఇవ్వాల్సి రావచ్చని కూడా ఆయన సూచించారు. ఉత్పత్తి పొడిగింపు లాభాల పరంగా తెలివైన నిర్ణయం కాకపోవచ్చని మస్క్ ఎక్స్‌లో పేర్కొన్నారు.సైబర్‌ట్రక్ ఏడాదికి 2.5 లక్షల యూనిట్ల ఉత్పత్తి సాధిస్తుందని గతంలో మస్క్ అంచనా వేశారు. అయితే 2023 చివర్లో డెలివరీలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం అమ్మకాలు సుమారు 70 వేల యూనిట్లేనని పరిశ్రమ అంచనాలు చెబుతున్నాయి.సైబర్‌ట్రక్ యజమానులు, అభిమానుల నుంచి వచ్చిన వ్యతిరేకత కూడా తాజా నిర్ణయంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. ఈ మోడల్ ఉత్పత్తిని కొనసాగించాలని కోరుతూ 5 వేల మందికి పైగా ఆన్‌లైన్ పిటిషన్‌పై సంతకాలు చేశారు. టెస్లా వాహనాలకు విడిభాగాలు, ఉపకరణాలు తయారు చేసే అన్‌ప్లగ్డ్ పెర్ఫార్మెన్స్ సంస్థ కూడా పెట్టుబడిదారుల సాయంతో సైబర్‌ట్రక్ ఉత్పత్తిని చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

దేశంలో అస్థిర రుతుపవనాలు, ఎల్‌నినో ఎఫెక్ట్

అస్థిర రుతుపవనాలు, ఎల్‌నినో ప్రభావం కారణంగా మరోసారి వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉందని ఓ సంస్థ తన నివేదికలో వెల్లడించింది



భారత్‌లో అస్థిర రుతుపవనాలు, ఎల్‌నినో పరిస్థితులు కారణంగా 2027వ ఆర్థిక సంవత్సరంలో(ఖీ27) ఆహార ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన నివేదికలో పేర్కొంది. మొత్తం ధరల ఒత్తిళ్లు క్రమంగా తగ్గుతాయని అంచనాలు ఉన్నప్పటికీ ఈ ఆహార ద్రవ్యోల్బణ ప్రమాదం తప్పదని హెచ్చరించింది. దీనివల్ల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని తెలిపింది. ప్రతికూల బేస్ ఎఫెక్ట్ కారణంగా సమీప భవిష్యత్తులో ప్రధాన ద్రవ్యోల్బణం ఎక్కువగానే ఉండొచ్చని వెల్లడించింది. అయితే బేస్ ఎఫెక్ట్ ప్రభావం తగ్గి, సరఫరాపరమైన ఒత్తిళ్లు సద్దుమణిగితే 2027వ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం క్రమంగా సాధారణ స్థితికి చేరుకునే ఛాన్స్ ఉందని అంచనా వేసింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్ల పెంపు ప్రక్రియ మరీ ఎక్కువగా ఉంటుందని తాము అంచనా వేయట్లేదని నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన నివేదికలో వెల్లడించింది. అయితే ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం మరోసారి వడ్డీ రేట్లు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. ద్రవ్యోల్బణ ముప్పు ఇలాగే కొనసాగితే, కేంద్ర బ్యాంకు మరిన్ని కఠినమైన ద్రవ్య విధాన చర్యలను పరిగణనలోకి తీసుకోవచ్చని ఇది సూచిస్తోందని తెలిపింది. ప్రధాన ద్రవ్యోల్బణం పెరగడానికి ఆహార ధరలు, బేస్ ఎఫెక్ట్‌లే ముఖ్య కారణమని అంచనా వేసింది. అయితే, డిమాండ్ ఆధారిత ఒత్తిళ్లు మాత్రం సాపేక్షంగా నియంత్రణలోనే ఉన్నాయని స్పష్టం చేసింది.“తక్కువ బేస్ ఎఫెక్ట్ కారణంగా సమీప భవిష్యత్తులో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండొచ్చు. అయితే బేస్ ఎఫెక్ట్స్ తగ్గడం, సరఫరా ఒత్తిళ్లు సడలితే 2027వ సంవత్సరంలో ద్రవ్యోల్బణం సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ ఎల్ నినో, అస్థిర రుతుపవనాల కారణంగా ఆహార ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఇది వినియోగదారుల ధరల తగ్గుదల వేగాన్ని ప్రభావితం చేసి, భవిష్యత్తులో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల నిర్ణయాలలో కీలక అంశంగా మారుతుంది” అని నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ స్పష్టం చేసింది.ఈ ఏడాది అక్టోబర్‌లో భారతదేశపు వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 6.1 శాతానికి పెరిగింది. సెప్టెంబర్ నెలలో ఇది 5.5 శాతంగా ఉండగా, తాజా గణాంకాలు గత రెండేళ్లలోనే అత్యధిక స్థాయిని నమోదు చేశాయి. గతేడాది అక్టోబర్‌లో ద్రవ్యోల్బణం సున్నా శాతంగా ఉండటం వల్ల ఏర్పడిన తక్కువ బేస్ ఎఫెక్ట్ ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని, ఇది అంచనాలకు అనుగుణంగానే ఉందని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. అలాగే, అస్థిర రుతుపవనాల ప్రభావం, ప్రతికూల బేస్ ఎఫెక్ట్ కారణంగా ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 7.4 శాతం ఉండగా, అది అక్టోబర్ నాటికి 8.5 శాతానికి చేరింది.మరోవైపు, ఆహారం, ఇంధనాన్ని మినహాయించి లెక్కించే కోర్ సీపీఐ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లోని 4.6 శాతం ఉండగా, అది అక్టోబర్ నాటికి 4.8 శాతానికి పెరిగింది. ఆహారం, ఇంధనం, నిత్యావసర వస్తువులను మినహాయించి లెక్కించే సూపర్ కోర్ ద్రవ్యోల్బణం 3.2 శాతం నుంచి 3.8 శాతానికి పెరుగుదల నమోదు చేసింది. కమర్షియల్ ఎల్‌పీజీ, ముడి పదార్థాల ధరలు పెరగడం వల్ల రెస్టారెంట్ సేవల ద్రవ్యోల్బణం 9.4 శాతం నుంచి 10.1 శాతానికి పెరిగింది. ముడి చమురు ఆధారిత పదార్థాలు, పత్తి ధరలు పెరగడం వల్ల దుస్తులు, పాదరక్షల ద్రవ్యోల్బణం కూడా 3.9 శాతం నుంచి 5 శాతానికి పెరిగింది.కాగా, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ‘ఎల్ నినో’ పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చి, 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉందని వరల్డ్ మెట్రలాజికల్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎంఓ) ఇటీవలే హెచ్చరించింది. దీనివల్ల వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై గణనీయమైన ప్రభావం పడొచ్చని అంచనా వేసింది. అలాగే వరదలు, కరవు, తీవ్రమైన వేడి వంటి ప్రమాదాలు కూడా తలెత్తవచ్చని తెలిపింది. ఈ దీర్ఘకాలిక ఎల్ నినో ప్రభావం భారత్ వాతావరణంపై, ముఖ్యంగా వర్షపాతం, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని పేర్కొంది.

ఉబర్‌లో భారీ డేటా లీక్.. డ్రైవర్ల వివరాలు బహిర్గతం!

ఉబర్‌లో మరోసారి డేటా బ్రీచ్ కలకలం

థర్డ్ పార్టీ సంస్థ వైఫల్యం కారణంగా లీకైన సమాచారం

డ్రైవర్ల లైసెన్స్ వివరాలు సహా వ్యక్తిగత డేటా బహిర్గతం

లీకైన సమాచారం దుర్వినియోగం కాలేదన్న ఉబర్

ప్రభావితమైన వారికి 90 రోజుల పాటు ఉచిత సేవలు



ప్రముఖ రైడ్-హెయిలింగ్ సంస్థ ఉబర్ టెక్నాలజీస్ మరోసారి డేటా బ్రీచ్‌తో వార్తల్లో నిలిచింది. తమ భాగస్వామ్య సంస్థ అయిన ‘ఫైర్‌వర్క్స్ ఏఐ’ వైఫల్యం కారణంగా డ్రైవర్లకు చెందిన కీలక వ్యక్తిగత సమాచారం లీక్ అయినట్లు ఉబర్ అధికారికంగా ప్రకటించింది. ఈ ఘటనలో డ్రైవర్ల లైసెన్స్ వివరాలు కూడా బహిర్గతమైనట్లు తెలియడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.ఫైర్‌వర్క్స్ ఏఐ సంస్థకు చెందిన ఇంటర్నల్ క్రెడెన్షియల్స్‌ను ఓ గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించి, వాటి ద్వారా ఉబర్‌కు సంబంధించిన డేటాను యాక్సెస్ చేసినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. అక్టోబర్ 9న ఈ విషయాన్ని గుర్తించిన ఉబర్, వెంటనే ఫైర్‌వర్క్స్ ఏఐతో ఉన్న డేటా సంబంధాలను నిలిపివేసి, విచారణకు ఆదేశించింది.ఈ ఘటనలో మొత్తం ఎంతమంది ప్రభావితమయ్యారనే సంఖ్యను ఉబర్ వెల్లడించనప్పటికీ, అమెరికాలోని పలు రాష్ట్రాల అధికారులకు సమర్పించిన నివేదికల ప్రకారం వేలమంది డేటా లీకైనట్లు తెలుస్తోంది. ఒక్క రోడ్ ఐలాండ్‌లోనే సుమారు 1,873 మంది ప్రభావితమైనట్లు సమాచారం.ప్రభావితమైన వారికి 90 రోజుల పాటు ఉచితంగా క్రెడిట్ మానిటరింగ్, ఫ్రాడ్ సహాయాన్ని అందిస్తున్నట్లు ఉబర్ తెలిపింది. ఇప్పటివరకైతే లీకైన సమాచారం దుర్వినియోగమైనట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని కంపెనీ స్పష్టం చేసింది. కాగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని పెంచే క్రమంలో ఉబర్ ఈ ఏడాది జులైలో కస్టమర్ సర్వీస్ విభాగంలో 10 శాతం మంది ఉద్యోగులను తగ్గించిన విషయం తెలిసిందే.

పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త క్లెయిమ్ చేయని డబ్బు ఇక నేరుగా బ్యాంక్ అకౌంట్లోకే!

పాత లేదా నిరుపయోగంగా ఉన్న ఈపీఎఫ్ ఖాతాల్లో రూ.1000 వరకు నిలిచిపోయిన మొత్తాల్ని క్లెయిమ్ లేకుండానే అర్హులైన సభ్యుల బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేయాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది



ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పీఎఫ్ ఖాతాదారుల కోసం ఒక సరికొత్త, విప్లవాత్మక సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. పాత, అలాగే ఇనాక్టివ్ పీఎఫ్ అకౌంట్లలో చిక్కుకుపోయిన చిన్న చిన్న నిధుల్ని ఉపసంహరించుకునే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం మరింత సరళతరం చేసింది. సాధారణంగా ఉద్యోగులు కంపెనీలు మారినప్పుడు లేదా పాత రికార్డులు సరిగా లేకపోవడం వల్ల వారి పాత పీఎఫ్ ఖాతాల్లో చిన్న మొత్తాలు అలానే ఉండిపోతుంటాయి. ఇలాంటి ఇబ్బందుల్ని తొలగించి పీఎఫ్ సభ్యులకు సహాయం చేయడానికే ఈపీఎఫ్ఓ ఈ కొత్త సేవల్ని ప్రారంభించింది.కొత్త నిబంధన ప్రకారం అర్హులైన లబ్ధిదారులు తమ పాత లేదా ఇనాక్టివ్ పీఎఫ్ అకౌంట్ నుంచి డబ్బులు విత్‌డ్రా చేసుకోవడానికి ఎలాంటి ప్రత్యేక క్లెయిమ్ సమర్పించాల్సిన అవసరం లేదు. పాత అకౌంట్లలో నిలిచిపోయిన రూ. 1000 లోపు పీఎఫ్ నిధుల్ని ఎలాంటి ముందస్తు దరఖాస్తు లేకుండానే నేరుగా వెనక్కి ఇచ్చేస్తారు. ఈపీఎఫ్ఓ సంస్థే స్వయంగా సదరు ఉద్యోగి అధికారిక గుర్తింపు (ఖీజ), బ్యాంక్ అకౌంట్ వివరాల్ని క్షుణ్ణంగా వెరిపై చేసిన తర్వాత, ఆ సెటిల్మెంట్ ప్రక్రియను పూర్తి చేస్తుంది. ఆపై సదరు చిన్న మొత్తాన్ని నేరుగా అర్హులైన లబ్ధిదారుడి బ్యాంక్ అకౌంట్‌కే బదిలీ చేస్తుంది. ఈపీఎఫ్ఓ కొత్త సదుపాయం కింద దాదాపు 1 లక్ష పీఎఫ్ అకౌంట్లకు లబ్ధి చేకూరనుండగా, ఆయా ఖాతాల్లో ఉన్న సుమారు రూ. 5 కోట్ల వరకు నిధులు లబ్ధిదారులకు చేరనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.“ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయి, చాలా కాలంగా వాడకుండా నిరుపయోగంగా ఉన్న పీఎఫ్ ఖాతాల్లో రూ. 1000 లోపు బ్యాలెన్స్ ఉన్న చందాదారులు డబ్బుల కోసం ఎలాంటి విడి క్లెయిమ్ దరఖాస్తులు చేయాల్సిన అవసరం లేదు. ఈపీఎఫ్ఓ సంస్థనే స్వయంగా గుర్తింపు సహా బ్యాంక్ ఖాతా వివరాల్ని పరిశీలించి, ఆటోమేటిక్‌గా సెటిల్మెంట్ ప్రక్రియను ప్రారంభిస్తుంది. తద్వారా అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఆ డబ్బు జమ అవుతుంది. ఈ నిర్ణయం వల్ల ఒక లక్ష మంది పీఎఫ్ చందాదారులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుంది.”– కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏంటంటే– పాత పీఎఫ్ అకౌంట్, ఇనాక్టివ్ పీఎఫ్ అకౌంట్ రెండూ వేర్వేరు అంశాలు. ఈపీఎఫ్ఓ నిబంధనల ప్రకారం ఒక ఉద్యోగికి 55 ఏళ్లు నిండిన తర్వాత లేదా రిటైర్మెంట్ పొందిన తర్వాత (వీటిలో ఏది ఆలస్యమైతే అది), వరుసగా మూడేళ్ల పాటు ఆ పీఎఫ్ అకౌంట్లోకి ఎలాంటి కాంట్రిబ్యూషన్స్ జమ కాకుంటే, అలాంటి ఖాతాను ఇనాక్టివ్ లేదా ఇనాపరేటివ్ (నిష్క్రియ ఖాతాలు) అకౌంట్లుగా పరిగణిస్తారు. ఈపీఎఫ్ఓ ప్రవేశపెట్టిన ఈ ఆటోమేటిక్ సెటిల్మెంట్ సదుపాయం కేవలం రూ. 1000 వరకు బ్యాలెన్స్ ఉన్న అర్హత కలిగిన ఇనాక్టివ్ ఖాతాలకు మాత్రమే వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. అకౌంట్లో రూ. 1000 లేదా అంతకంటే ఎక్కువగా ఉన్నప్పుడు వాటి నుంచి డబ్బును విత్‌డ్రా చేసుకోవాలన్నా లేదా ఇతర అకౌంట్లకు బదిలీ చేసుకోవాలనుకున్నా పాత పద్ధతిలోనే క్లెయిమ్ దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది.గత కొన్నేళ్లుగా ఈపీఎఫ్ఓలో చందాదారులుగా ఉన్న ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 3.49 కోట్లుగా ఉన్న ఈపీఎఫ్ సబ్‌స్క్రైబర్స్ సంఖ్య, 2026 సెప్టెంబర్ 16 నాటికి ఏకంగా 7.98 కోట్లకు చేరుకుంది. ఈ సమయంలో కొత్తగా 4.49 కోట్ల మంది చందాదారులు ఈపీఎఫ్ఓ పరిధిలోకి వచ్చారు.ఇక పీఎఫ్ సబ్‌స్క్రైబర్లు తమ అకౌంట్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని మొబైల్‌లో వాట్సాప్ ద్వారానే సులభంగా తెలుసుకోవచ్చు. కొద్ది రోజుల కిందట ఈపీఎఫ్ఓ వాట్సాప్ హెల్ప్‌లైన్ కమ్ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈపీఎఫ్ఓ అందుబాటులోకి తెచ్చింది. ఈ సేవల ద్వారా పీఎఫ్ సభ్యులు తమ ఖాతాలో జమైన మొత్తం బ్యాలెన్స్, చివరి ఐదు ట్రాన్సాక్షన్స్ వివరాలు, ఈపీఎఫ్ పాస్‌బుక్ సమాచారం క్షణాల్లో ఇంట్లో ఉండే మొబైల్ ద్వారా తెలుసుకోవచ్చు.

క్యూ2లో వియాష్ సైంటిఫిక్ జోరు

ఫార్మా రంగ సంస్థ వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (క్యు2 ఖీ27) బలమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఈ త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం రూ. 84.65 కోట్లుగా నమోదు కాగా, మొత్తం ఆదాయం రూ. 999.7 కోట్లకు చేరింది.గత ఆర్థిక సంవత్సరం (2025-26) ఇదే త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ పనితీరు గణనీయంగా మెరుగుపడింది. గతేడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ. 857.76 కోట్లు, నికర లాభం రూ. 72.90 కోట్లుగా ఉన్నాయి. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 850.30 కోట్ల నుంచి 16.2 శాతం పెరిగి రూ. 987.94 కోట్లకు చేరుకుంది.కంపెనీ ఫార్ములేషన్స్, ఏపీఐ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్) విభాగాల్లో రెండంకెల స్థాయిలో అమ్మకాల వృద్ధి నమోదు చేయడం ఈ పురోగతికి ప్రధాన కారణంగా నిలిచింది. దీనికి తోడు, కంపెనీ తన అనుబంధ సంస్థ అయిన అలివిరా యానిమల్ హెల్త్ ద్వారా ఇటలీకి చెందిన బయోఫర్‌లైఫ్ కొనుగోలును విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ఒప్పందం యూరప్‌లోని యానిమల్ హెల్త్ మార్కెట్‌లో కంపెనీ వ్యాపారాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలోనూ (ఏప్రిల్-సెప్టెంబర్ 2026) వియాష్ సైంటిఫిక్ మంచి పనితీరు కనబరిచింది. ఈ ఆరు నెలల కాలంలో మొత్తం ఆదాయం రూ. 1,954.3 కోట్లకు చేరగా, నికర లాభం 49 శాతం వృద్ధితో రూ. 163.94 కోట్లుగా నమోదైంది. నవంబర్ 13న జరిగిన బోర్డు సమావేశంలో ఈ ఆర్థిక ఫలితాలకు ఆమోదం తెలిపారు. విలీనం తర్వాత కంపెనీ కార్యకలాపాలు స్థిరంగా రాణిస్తున్నాయని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.



ప్రశాంత్ నీల్ హార్రర్ థ్రిల్లర్ '418'ను థియేటర్లలో మిస్సయ్యారా?

టాలీవుడ్ టాప్ బ్యానర్లలో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం 418. హార్రర్ తోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో పతంగ్ సినిమాతో నుంచి గుర్తింపు తెచ్చుకున్న ఇంటర్నెట్, సోషల్ మీడియా పర్సనాలిటీ ప్రీతి పగడాల లీడ్ రోల్‌లో నటించగా.. చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన ఈ మూవీని కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేశారు. అక్టోబర్ 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల ఈ చిత్రానికి మిక్స్‌డ్ రివ్యూస్ రాబట్టుకుంది. అయితే థియేటర్లలో ఈ సినిమాను మిస్సయిన వారి కోసం ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. 418 ఇక ఓటీటీలోనూ సందడి చేయనుంది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో నవంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ పలు ప్రధాన భారతీయ భాషల్లో అందుబాటులో ఉండనుంది. మరి ఓటీటీలో ఈ చిత్రానికి ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రం సూర్య రాజ్, శషాంక్ పాటిల్, రమేశ్ ఇందిర ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. దినేశ్ దినకరన్, సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన ఈ చిత్రానికి వెంకీ జీజీ మ్యూజిక్ కంపోజర్‌గా వ్యవహరించాడు.

ప్రశ్నిస్తే.. రాజకీయ ముద్ర వేస్తారా?



విశాఖపట్నంలో పట్టణీకరణ పేరుతో కొండలను తవ్వుతుండటంపై టాలీవుడ్ హీరోయిన్ చాందిని చౌదరి ఇటీవల ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. అయితే ఆమె అభిప్రాయంపై కొందరు నెటిజన్లు విమర్శలు, ట్రోల్స్‌కు దిగారు. ఈ నేపథ్యంలో తాజాగా చాందిని ఓ వీడియోను విడుదల చేస్తూ ట్రోలర్స్‌కు తనదైన శైలిలో సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు ఉండాలి. మనకు బాధ కలిగించే విషయం ఏదైనా జరిగినప్పుడు మర్యాదపూర్వకంగా, గౌరవంగా మన ఆలోచనలను, భావోద్వేగాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉండాలి. ఒక సాధారణ పౌరురాలిగా తన అభిప్రాయాన్ని వెల్లడిస్తే దానికి రాజకీయ రంగు పులమడం సరికాదు. గతంలో జరిగినా.. ప్రస్తుతం జరుగుతున్నా.. ఏ విషయంపైనైనా పౌరులుగా స్పందించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఒకరి అభిప్రాయాలను తమకు అనుకూలంగా మార్చుకుని, రాజకీయ అనుబంధాలు అంటగడుతూ విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

సోనాక్షి సిన్హా మార్ఫింగ్ ఫొటోల వివాదం.. నిందితుడికి ఊరటనిచ్చిన ముంబై కోర్టు

సటి సోనాక్షి సిన్హా మార్ఫింగ్ ఫోటోల కేసులో ఢిల్లీలో అరెస్టయిన ఆర్యన్ దీపక్ జైన్‌ను ముంబై కోర్టు విడుదల చేసింది. సరైన అరెస్ట్ నిబంధనలు, బీఎన్ఎస్ఎస్ చట్ట నిబంధనలను పోలీసులు పాటించకపోవడంతో ఈ అరెస్ట్ అక్రమమని మేజిస్ట్రేట్ స్పష్టం చేసింది. సోనాక్షి సిన్హా ఫిర్యాదు మేరకు ముంబైలోని బాంద్రా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, పోలీసులు ఢిల్లీలోని షహద్రా ప్రాంతంలో ఆర్యన్ దీపక్ జైన్‌ను అదుపులోకి తీసుకుని ముంబైకి తీసుకువచ్చారు. అయితే, నిందితుడిని ముంబైకి తీసుకువచ్చే ముందు ఢిల్లీలోని స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చడంలో పోలీసులు విఫలమయ్యారని కోర్టు గుర్తించింది. ఏడు సంవత్సరాల వరకు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(1)(ఎ) ప్రకారం తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను, అరెస్ట్ కారాణన్ని సమోదు చేయడంలో దర్యాప్తు అధికారులు విఫలమయ్యారని న్యాయస్థానం పేర్కొంది. కేవలం దర్యాప్తు అవసరం అనే సాకుతో చట్టపరమైన రక్షణలను విస్మరించి ఎవరినీ నిర్బంధించలేమని తేల్చిచెప్పిన మేజిస్ట్రేట్, నిందితుడిని తక్షణమే విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.





అల్లు అర్జున్ నుంచి 'రాకా' అప్‌డేట్స్ వస్తాయా అభిమానుల్లో భారీ అంచనాలు!

బకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇప్పటివరకు చాలా గోప్యంగా ఉంచుతున్నారు. దీంతో బన్నీ అభిమానులు ఎప్పుడప్పుడు కొత్త అప్‌డేట్స్ వస్తాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా అల్లు అర్జున్ పాల్గొనబోతున్న ఓ సినిమా ఈవెంట్‌పై అందరి దృష్టి పడింది. తాజాగా అల్లు అర్జున్ హైదరాబాద్‌లో జరగనున్న 'ఆకాశంలో ఒక తార' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో బకాన్ స్టార్ ఏం మాట్లాడబోతున్నారు? సినిమాకు సంబంధించి ఎలాంటి విశేషాలు పంచుకోబోతున్నారు? అనే ఆసక్తి నెలకొంది. అయితే ఈ ఈవెంట్‌కు హాజరవుతున్న బన్నీ నుంచి తమ అభిమాన చిత్రాలకు సంబంధించిన అప్‌డేట్స్ కూడా వస్తాయని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ముఖ్యంగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రాకా' సినిమా గురించి అల్లు అర్జున్ ఏదైనా కీలక విషయం వెల్లడిస్తారా? షూటింగ్‌కు సంబంధించిన విశేషాలను పంచుకుంటారా? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా'పై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై సినీ అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. అట్లీ తన సినిమాల్లో చూపించే గ్రాండ్ విజువల్స్, భారీ యాక్షన్ సన్నివేశాలు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు ఆయన అల్లు అర్జున్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో అల్లు అర్జున్ పూర్తిగా నిమగ్నమై ఉన్నారు. అయితే కథ, పాత్రలు, ఇతర నటీనటుల వివరాల విషయంలో చిత్ర బృందం పెద్దగా సమాచారం బయటకు వెల్లడించడం లేదు. దీంతో అభిమానులు ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్నారు. మరోనెపు అల్లు అర్జున్ తదుపరి ప్రాజెక్ట్ 'ఆూ23'పై కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కోలీవుడ్ దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో బన్నీ ఈ సినిమా చేయబోతుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. లోకేష్ తనదైన యాక్షన్ కథలు, ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్‌తో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలయికలో ఎలాంటి సినిమా రాబోతోంది? ఇది పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందా? అనే ప్రశ్నలు అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో 'ఆూ23' గురించి కూడా బన్నీ ఏదైనా ఆసక్తికరమైన విషయం వెల్లడిస్తారని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.